
రాజధానిగా అమరావతికి చట్టపరమైన గుర్తింపు లభించడం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఘట్టం. దీనిని సాకారం చేసిన సీఎం చంద్రబాబుగారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి, రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ముగారికి, ప్రధాని నరేంద్ర మోదీగారికి, పార్లమెంట్లో ఈ బిల్లును సమర్థించిన రాజకీయ పార్టీల నేతలకు ధన్యవాదాలు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



బుధవారం 08.04.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 | సంచిక - 351 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00




## కొలువుల కల్పనే పరమావధి

### ౨౦ లక్షల ఉద్యోగాల దిశగా మంత్రుల ఉపసంఘం కసరత్తు


- రాష్ట్రంలో ప్రతి ఉద్యోగాన్ని ట్రాక్ చేయాలి
- మా దృష్టిలో చిన్న పరిశ్రమ, పెద్ద పెట్టుబడులు రెండూ సమానమే
- పెట్టుబడులు గ్రౌండింగ్ పై దృష్టి కేంద్రీకరించాలి
- ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్న 787 కంపెనీలను ట్రాక్ చేస్తాం
- 20 లక్షల ఉద్యోగాల కల్పనపై మంత్రుల ఉపసంఘం సమావేశంలో మంత్రి లోకేష్ దిశానిర్దేశం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యమని, ఇప్పటివరకు ప్రజాప్రభుత్వం కల్పించిన ప్రతి ఉద్యోగాన్ని ట్రాక్ చేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ఏర్పాటుచేసిన మంత్రుల ఉపసంఘం సమావేశం జరిగింది. రాష్ట్రానికి ఇప్పటివరకు వచ్చిన పరిశ్రమలు, కల్పించిన ఉద్యోగాలతో పాటు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న ప్రాజెక్టుల గ్రౌండింగ్ పై సమావేశంలో చర్చించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో యువతకు 6.25 లక్షల ఉద్యోగాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనకు తీసుకుంటున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

**ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్న 787 కంపెనీలను ట్రాక్ చేస్తాం :** ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. 20 లక్షల ఉద్యోగాల కల్పన ప్రజాప్రభుత్వ వాగ్దానం. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా ప్రతిఒక్కరు కంకణబద్ధులై పనిచేయాలి. నైపుణ్యం పోర్టల్ మాదిరిగానే ప్రతిఒక్క ఉద్యోగాన్ని ఆధార్/కేవైసీ లింకేజీతో ట్రాక్ చేయాలి. మా దృష్టిలో చిన్న పరిశ్రమలు, పెద్ద పెట్టుబడులు రెండూ సమానమే. ఉద్యోగాల కల్పనే మాకు ముఖ్యం. పరిశ్రమల స్థాపన, అనుమతుల విషయంలో సింగపూర్, దుబాయ్ కంటే సులభతరంగా ఉండాలి. మిగతా 2లో...

### సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా


## రాయలసీమ



- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ట్రాన్స్‌మిషన్ లైన్స్
- ఏపీలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీపై ప్రత్యేక దృష్టి
- వ్యవసాయ వ్యర్థాల సద్వినియోగం జరిగేలా యూనిట్ల ఏర్పాటు
- ఆధునిక భద్రతా ప్రమాణాలతో పారిశ్రామిక ప్రాజెక్టులు
- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 16వ ఎస్ఐపీబీ సమావేశం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తి చేసే పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకునేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రత్యేకించి రాయలసీమ జిల్లాల్లో సౌరవిద్యుత్ ప్రాజెక్టులను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి పునరుద్పాదక విద్యుత్ ను తయారు చేసుకునేందుకు వీలుందని ఆయన సూచించారు. దీనికి అనుగుణంగా ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అలాగే ఉత్పాదనకు అనుగుణంగా భవిష్యత్తులో ఆ విద్యుత్ ను ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసేలా ట్రాన్స్ మిషన్ లైన్లను కూడా సిద్ధం చేసుకోవాలని సీఎం సూచించారు. సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 16వ ఎస్ఐపీబీ సమావేశం రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడి ప్రతిపాదనలకు ఆమోదం తెలియచేసింది. ఈ సమావేశానికి మంత్రులు నారాలోకేష్, కె.అచ్చెన్నాయుడు, పి.నారాయణ, కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్ధన్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్ , సీఎస్ జి.సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. పరిశ్రమలు, విద్యుత్, ఐటీ, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో మిగతా 2లో...

## రాజధాని చట్టబద్ధత గెజిట్ విడుదల పట్ల హర్షం



• ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాజధానికి చట్టబద్ధత కల్పిస్తూ గెజిట్ విడుదల కావడం రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నం సాకారమైన చారిత్రాత్మక ఘట్టమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) చట్టం, 2026కు ఆమోదం తెలిపిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి దిశానిర్దేశం చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై కట్టుబడి ఉందని, ఈ బిల్లుకు మద్దతు తెలిపిన పార్లమెంట్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అమరావతికి చట్టబద్ధత కల్పించడంలో కీలక పాత్ర పోషించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీతో పాటు పార్లమెంట్‌లో బిల్లుకు మద్దతు తెలిపిన అన్ని రాజకీయ పార్టీల నాయకులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మిగతా 2లో...



## తీరం దాటుతున్న తమిళ ఆగడాలు

- తమిళనాడు బోట్ల ఆగడాలపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన మత్స్యకారుల ఆగడాలు పెరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి విడుదలైన ప్రకటనలో నెల్లూరు, ఒంగోలు, బాపట్ల జిల్లాల తీర ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. కడలూరు, కారైకాల్ ప్రాంతాల నుంచి స్పీడ్ బోట్లలో వచ్చి అక్రమంగా ఆంధ్ర తీరప్రాంతంలోకి ప్రవేశిస్తూ స్థానిక మత్స్యకారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె ప్రాంతంలో అక్రమంగా సంచరిస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్న తమిళనాడు బోట్లను స్థానిక మత్స్యకారులు నిర్బంధించగా ఉద్రిక్తత నెలకొన్నట్లు తెలిపారు.

## పాఠ్యాంశాలు నవీకరణ



- కాలేజీ విద్య రీ-ఓరియెంటేషన్
- ఉచిత ఇళ్ల స్థలాల పంపిణీ వేగవంతం కావాలి
- విద్యుత్ తీగల వల్ల ప్రమాదాలు జరగకూడదు
- ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- అవేర్ 2.0 మొబైల్ యాప్ లాంచ్ చేసిన ముఖ్యమంత్రి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న పథకాలు.. కార్యక్రమాలను పక్కా ప్రణాళికలతో అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంతోపాటు.. సంతృప్తి కలిగించే రీతిలో సేవలు అందించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునే విషయంలో ఎలాంటి జాప్యమూ జరగకూడదని ముఖ్యమంత్రి ఆదేశించారు. మంగళవారం ఆర్టీజీస్ నుంచి మిగతా 2లో...

## అమరావతికి అక్వా కళ



- అమరావతిలో ఎన్ఎఫ్‌డీబీ రీజినల్ ఆఫీస్‌కు గ్రీన్ సిగ్నల్
- మత్స్యకారులకు విస్తృత ప్రయోజనాలు
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి

2లో

## సామాన్యుడికీ 'ప్యాలెస్' ప్రవేశం!



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** విశాఖపట్నంలోని రుషికొండ భవనాలను (ప్యాలెస్)ను ప్రజల సందర్శనకు అనుమతించడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయ వనరుగా మార్చే దిశగా చర్చలు జరిగాయని 2లో...

## అగ్నిమాపక శాఖ ఆధునీకరణ



- పొరుగు రాష్ట్రాలకు ఆదర్శంగా ఏపీ అగ్నిమాపక విపత్తు నిర్వహణ శాఖ
- అధునాతన ఫైర్ టెండర్ వాహనాలు, పరికరాలు ప్రారంభించిన సీఎం చంద్రబాబు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా అగ్నిమాపక విపత్తు నిర్వహణ శాఖను తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విపత్తుల సమయంలో పొరుగు రాష్ట్రాలకు సహాయం చేసిన చరిత్ర ఏపీకి ఉందని గుర్తు చేశారు. అమరావతి పరేడ్ గ్రౌండ్‌లో అగ్నిమాపక శాఖ నూతన వాహనాలు, పరికరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. రూ.252.93 కోట్లతో అగ్నిమాపక శాఖ ఆధునీకరణలో భాగంగా రూ.33.25 కోట్ల విలువైన వాహనాలు, వివిధ పరికరాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. రూ.18 కోట్ల వ్యయంతో తొలిదశలో 25 అధునాతన అగ్నిమాపక శకటాలు, రూ.10 కోట్లతో హై ప్రెషర్ పంప్‌లు కలిగిన 40 క్విక్ రెస్పాన్స్ వాహనాలు, రూ.2.49 కోట్లతో 50 ఇన్ ఫ్లేటబుల్ రబ్బర్ బోట్లు, రూ.2.08 కోట్లతో 30 బీఏ సెట్ కంప్రెసర్లను కొనుగోలు చేసింది. వాహనాలను జెండా ఊపి ప్రారంభించిన అనంతరం.. వాటి గురించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం కేంద్ర నిధులను సమర్థంగా వినియోగించుకున్నందుకు అధికారులను అభినందించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ....ప్రజల ప్రాణాలు కాపాడడానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అమరావతి రాజధానితో పాటు ఇప్పుడు ప్రధాన నగరాల్లో హై రైజ్డ్ బిల్డింగ్‌లు నిర్మాణం అవుతున్నాయని..వాటికి అనుగుణంగా అగ్నిమాపక శాఖ అన్ని విధాలా ఆధునిక పరికరాలు సమకూర్చుకోవాలని సీఎం సూచించారు. అన్ని సవాళ్ళను అధిగమించి... కేంద్ర పథకాలను, రాష్ట్ర ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుని శాఖను బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి అనిత, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, అగ్నిమాపక శాఖ డీజీ పీవీ రమణ, హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్, పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## నీటి సంరక్షణకు 'జలధార' ఉద్యమం

- రాష్ట్ర వ్యాప్తంగా వంద రోజుల కార్యాచరణ
- కాలువలు, చెరువుల్లో పూడికతీతలు, మరమ్మతులు
- ప్రతి ఎకరాకూ నీరందిస్తాం
- నీటి బొట్టుతో సంపద సృష్టి.. ఇదే చంద్రబాబు లక్ష్యం
- అమరావతిపై విషం కక్కుతున్న జగన్
- ఇది తప్పు అన్నందుకు పెట్రేగిపోతున్న జగన్ బ్యాచ్
- మీడియా సంస్థలు, ప్రజలపై వైసీపీ దాడులు గర్హనీయం
- చూస్తూ ఊరుకునేది లేదు : మంత్రి సవిత హెచ్చరిక
- శ్రీసత్యసాయి జిల్లా చాలకూరులో జలధార కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సవిత
- మహిళా రైతు కూలీలతో కలిసి వేరుశనగ పంటను వెలికితీసిన మంత్రి సవిత

3లో

## జల సంరక్షణే లక్ష్యం



- జల్ జీవన్ మిషన్ 2.0లో జల సంరక్షణకు ప్రాధాన్యం
- ప్రజల్లోనూ చైతన్యం కలిగించాలి
- 100 రోజుల స్పెషల్ డ్రైవ్ కు శ్రీకారం
- భవిష్యత్తు తరాల కోసం నీటిని కాపాడుకోవడం తప్పనిసరి
- 'గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థలో జలవనరుల స్థిరత్వం' వర్క్ షాపు ప్రారంభించి, ప్రసంగించిన ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** 'జలమే జీవం... జీవమే జల సంరక్షణకు మూలం అనే చైతన్యం ప్రతి ఒక్కరిలో రావాలి. సాధారణ ప్రజలు ఇళ్లలో వాడే నీటిని తిరిగి భూమిలోకి పంపే చర్యలు నుంచి వాగులు, వంకలు, నదుల ద్వారా వృథాగా సముద్రంలో కలుస్తున్న నీటిని కాపాడుకునే వరకు ఈ చైతన్యం అందరిలో వెల్లివిరియాల'ని ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. భూమి మీద మనిషికి అవసరం అయ్యే నీటి శాతం చాలా తక్కువగా ఉంది.. దాన్ని జాగ్రత్తగా కాపాడుకోకపోతే భవిష్యత్తు తరాలకు తీరని అన్యాయం చేసినట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పరిధిలో గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థలో జలవనరుల స్థిరత్వంపై ఒక రోజు వర్క్ షాపు కానూరులోని ఏపీఎస్ఐఆర్డీ భవన్ లో మంగళవారం ఉదయం మొదలైంది. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. మిగతా 2లో...

## కొలువుల కల్పనే పరమావధి



(మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమలకు అవసరమైన అన్ని శాఖలవారీ అనుమతులు, ఎన్వోసీలను మ్యాపింగ్ చేసి వాటి స్థితి, గడువు ట్రాకింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయాలి. పెట్టుబడులు గ్రౌండింగ్ పై అధికారులు ప్రధానంగా దృష్టిసారించాలి. సమస్యలను గుర్తించాలి. దీనిపై ప్రతివారం సమీక్షిస్తాం. ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్న 787 కంపెనీలను ట్రాక్ చేస్తాం. ఈడీబీని మరింత బలోపేతం చేస్తాం. ప్రతి శాఖ ఈడీబీ ట్రాకర్ ను పర్యవేక్షించేందుకు సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ ను నామినేట్ చేయాలని ఆదేశించారు. ఎంఎస్ఎంఈ పార్కులు, టెక్స్ టైల్ ఇండస్ట్రీకి పవర్ బ్యాంకింగ్ అంశాలపైనా సమావేశంలో చర్చించారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు టీజీ భరత్, కొల్లు రవీంద్ర, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, కొండపల్లి శ్రీనివాస్ తో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాజధానికి చట్టబద్ధత గెజిట్ విడుదలపై హర్షం



(మొదటి పేజీ తరువాయి)

అమరావతి సాధన కోసం దీర్ఘకాలంగా ఉద్యమించి త్యాగాలు చేసిన అమరవీరులను ఆయన స్మరించారు. ముఖ్యంగా అమరావతి ప్రాంత మహిళలు ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ చూపిన దీక్ష, పోరాటస్ఫూర్తి రాష్ట్ర ప్రజలకు ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. అలాగే ఈ ఉద్యమానికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి, మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఇకపై ఆంధ్రప్రదేశ్ ప్రజలందరూ గర్వంగా "మా రాజధాని అమరావతి" అని చెప్పుకునే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో అందరి సహకారంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌తో అమరావతిని అద్భుత రాజధానిగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

ఇది కేవలం చట్టపరమైన నిర్ణయం మాత్రమే కాకుండా, రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే విజయమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

## తీరం దాటుతున్న తమిళ ఆగడాలు



(మొదటి పేజీ తరువాయి)

ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రభుత్వం స్పందన ఆశించినంతగా లేదని మత్స్యకారులు భావిస్తున్నారని పేర్కొన్నారు. గత వారం నిర్బంధించిన బోట్లను రాత్రికి రాత్రే విడుదల చేసి తమిళనాడుకు పంపించడం అనుమానాలకు తావిస్తోందని విమర్శించారు. దాడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు లేకపోవడంతో స్థానిక మత్స్యకారుల్లో అభద్రతా భావం పెరుగుతోందన్నారు.

ఈ నేపథ్యంలో తీరప్రాంత భద్రతను బలోపేతం చేయాలని పీవీఎన్ మాధవ్ సూచించారు. మెరైన్ పోలీస్ స్టేషన్లను ఆధునీకరించి పటిష్టం చేయడం, స్థానిక మత్స్యకారులను హోం గార్డులుగా భాగస్వామ్యం చేయడం, కోస్టల్ గార్డ్ సహకారంతో పర్యవేక్షణ పెంచడం అవసరమని తెలిపారు. అలాగే 2010లో అమల్లో ఉన్న కోస్టల్ సెక్యూరిటీ టెక్నికల్ వ్యవస్థను పునరుద్ధరించి, మాజీ నేవీ సిబ్బంది, స్థానిక మత్స్యకారులను తిరిగి వినియోగించాలని సూచించారు.

అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే తమిళనాడు ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని కోరారు. అనేక సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రాష్ట్ర ప్రభుత్వానికి పీవీఎన్ మాధవ్ విజ్ఞప్తి చేశారు.

## అమరావతికి అక్వా కళ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతిలో నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖ రాయబట్టే ఎన్ఎఫ్‌డీబీ ఏర్పాటుకు కేంద్రం ముందుకు వచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలో ప్రముఖ ఆక్వాకల్చర్ రాష్ట్రంగా ఉండటంతో అమరావతిలో పూర్తి స్థాయి ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు అవసరమైన భూమి, ప్రాథమిక మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం అందించాలని కేంద్ర మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ లేఖ ద్వారా తెలియజేశారని మంత్రి వెల్లడించారు. దేశంలో ఆక్వాకల్చర్ రంగంలో అగ్రగామి రాష్ట్రంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్‌కు ఇది కీలక ముందడుగు అని, రాష్ట్ర మత్స్యరంగ అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా మారనుందని తెలిపారు. మత్స్యకారులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నూతన సాగు పద్ధతులు, నాణ్యమైన విత్తనాలు, ఫీడ్ మేనేజ్‌మెంట్, వ్యాధి నియంత్రణపై శిక్షణలు స్థానికంగా అందుబాటులోకి రానున్నాయి. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఆర్థిక సహాయం వేగవంతంగా చేరేలా సహకరిస్తుంది. ప్రాసెసింగ్, నిల్వ, రవాణా, ఎగుమతుల రంగాల్లో సాంకేతిక మద్దతు లభించడం ద్వారా మత్స్య ఉత్పత్తుల నాణ్యత మెరుగుపడుతుంది. మార్కెటింగ్ అవకాశాలు విస్తరించడంతో దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం బలపడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగి, యువతకు కొత్త ఉపాధి మార్గాలు అందుబాటులోకి వస్తాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

# సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా రాయలసీమ

(మొదటి పేజీ తరువాయి)

రూ. 39,436.84 కోట్ల విలువైన ప్రతిపాదనలకు రాష్ట్రస్థాయి పెట్టుబడుల బోర్డు ఆమోదం తెలియచేసింది. 31 ప్రాజెక్టుల ద్వారా 1,11,278 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. ప్రత్యేకించి రాయలసీమ జిల్లాల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి చేసే సామర్థ్యానికి అనుగుణంగా పెట్టుబడులను ఆకర్షించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. పస్తుతం రాష్ట్రంలో 325 గిగావాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఉత్పత్తి అయిన విద్యుత్ ను స్టేట్ గ్రిడ్, సెంట్రల్ గ్రిడ్ కు కనెక్టు చేసేలా చూడాలని మంత్రి లోకేష్ సూచనలు చేశారు. దీనిపై స్పందించిన సీఎం సమీప భవిష్యత్తులో ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు కూడా సరఫరా చేసేలా ట్రాన్స్ మిషన్ లైన్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రాజస్థాన్ లో సౌర విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నా పూర్తి స్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి ఉందని.. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో కంజ్యూమర్ ప్రాడెక్ట్స్ తయారీలో ఏపీ కీలకంగా మారాలని ముఖ్యమంత్రి సూచించారు. శ్రీసిటీ, కొప్పర్తి, అనంతపూర్ లలో ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ పరిశ్రమలు ఏర్పాటు అయ్యేలా పెట్టుబడుల్ని ఆకర్షించాలన్నారు. రాష్ట్రంలో జీసీసీల ఏర్పాటుపై కూడా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఏపీ జీసీసీలకు కేంద్రంగా మారాలన్నారు. వ్యవసాయం, ఉద్యాన, ఆక్వా కల్చర్ రంగాల్లో వస్తున్న వ్యర్థాలను సద్వినియోగం చేసుకునేలా ప్రాజెక్టులను



ఆహ్వానించాలని సీఎం స్పష్టం చేశారు. ఈ రంగాల్లో కాలుష్య కారకాలు లేకుండా ఇథనాల్ తరహా బై ప్రాడెక్టులు వచ్చేలా చూడాలని దీనికి సంబంధించిన అంశాలపై అధ్యయనం చేయాలన్నారు. దీనిపై కేంద్రం నుంచి సహకారం కూడా తీసుకోవాలని సూచించారు.

**పారిశ్రామిక ప్రాజెక్టుల్లో ఆధునిక భద్రతా ప్రమాణాలు:** రాష్ట్రంలో వివిధ పెట్టుబడి ప్రతిపాదనతో వస్తున్న పరిశ్రమల్లో ఆధునిక భద్రతా ప్రమాణాలను ఏర్పాటు చేసుకోవటం పై కూడా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు. భవిష్యత్తులో ఉత్పన్నమయ్యే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోనేలా ఈ సేఫ్టీ స్టాండర్డ్స్ ను నిర్దేశించాలన్నారు. ఫార్మా, స్టీల్, గ్రీన్ ఎనర్జీ, బీఈఎస్ లాంటి ప్రాజెక్టులు ఏర్పాటు అవుతున్న నేపథ్యంలో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేకంగా ఓ ఎస్ఓపీని సిద్ధం చేయాలని సూచించారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ నిబంధనలకు అనుగుణంగా ఈ భద్రతా ప్రమాణాలను పారిశ్రామిక యూనిట్లు కలిగి ఉండాలని తేల్చి చెప్పారు. ఇటీవల రాష్ట్రంలోని బాణా సంచా తయారీ యూనిట్లలో జరిగిన ప్రమాదాల నేపథ్యంలో ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బాణా సంచా తయారీ యూనిట్లు, మిల్క్ డెయిరీలు లాంటి అంశాల్లో ఉల్లంఘనలు లేకుండా ప్రామాణిక విధానాలు జారీ చేయాలని సూచించారు. నిర్దేశిత ప్రమాణాలను పాటించే విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అమరావతి క్వాంటం టవర్స్ ను త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. భూములు కేటాయించిన పర్యాటక ప్రాజెక్టులు నిర్దేశిత గడువులోగా కార్యకలాపాలు ప్రారంభించేలా చూడాలని.. ఈ విషయంలో ఎలాంటి మినహాయింపు లేదన్నారు.

**వేగంగా ప్రాజెక్టులు గ్రౌండింగ్ :** రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో ఆమోదం పొందిన ప్రాజెక్టులు త్వరితగతిన ప్రారంభం అయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. వీటితో పాటు భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలు కూడా సాకారమయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రత్యేకించి ఆయా ప్రభుత్వ శాఖలు వీటిపై దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఆయా ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యేలా చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. భారీ ప్రాజెక్టులపై ప్రతీ ఎస్ఐపీబీ సమావేశంలోనూ సమీక్షిద్దామని సీఎం స్పష్టం చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఉత్పత్తి సామర్థ్యం పెరగాలన్నారు. పామాయిల్, కోకో లాంటి ఉద్యాన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేలా చూడాలని సీఎం సూచించారు. ఉద్యాన ఉత్పత్తులు 200 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 400 లక్షల మెట్రిక్ టన్నులకు పెరగాలని అన్నారు. దీనికి తగినట్టుగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు కూడా పెరిగితే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని స్పష్టం చేశారు. ప్రాడెక్టు పర్ఫెక్షన్ పై కూడా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్ఎంఈ పార్కుల్లో పారిశ్రామిక యూనిట్ల ఏర్పాటు వేగంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న ప్రాజెక్టులు, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన వివరాలను వెబ్ సైట్ లో పొందుపరచాలని సీఎం సూచించారు. తాజాగా 16వ ఎస్ఐపీబీ సమావేశం ఆమోదించిన పెట్టుబడులతో కలిపి రాష్ట్రంలో గడచిన 22 నెలల్లో ఇప్పటి వరకు 264 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటి ద్వారా రూ. 9.36 లక్షల కోట్ల పెట్టుబడులు, 9.60 లక్షల మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సు ద్వారా 538 ఎంఓయూలకు గానూ రూ. 11.38 లక్షల పెట్టుబడులు, 13.95 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయి. మొత్తంగా 802 ప్రాజెక్టుల ద్వారా రూ. 20.74 లక్షల కోట్ల పెట్టుబడులు, 23.55 లక్షల ఉద్యోగాల కల్పన జరుగనుంది.

# పాఠ్యాంశాలు నవీకరణ

(మొదటి పేజీ తరువాయి)బీన5బ

వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ఈ ఏడాదిలో మరోసారి సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించుకున్నాం. ఆ దిశగా గృహ నిర్మాణ శాఖ వేగంగా పనిచేయలి. టిడ్కో ఇళ్లు కాకుండానే మరో 5 లక్షలకు ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్దిదారులకు అందించాలి. ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసే విషయంలో ఎక్కడా ఆలస్యం కాకూడదు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నాం.. లబ్దిదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఇది కొనసాగాలి. ఇళ్ల నిర్మాణంతోపాటు... ఇంటి స్థలాల పంపిణీ ప్రక్రియను వీలైనంత త్వరగా ప్రారంభించాలి. సుమారు 2 లక్షల మంది ఇళ్ల స్థలాలు కోరినట్టు సర్వేలో తేలింది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇళ్ల నిర్మాణాన్ని ఎంత వేగంగా చేపడుతున్నారో.. ఇళ్ల స్థలాల పంపిణీని కూడా అదే స్థాయిలో చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఇక వర్షాకాలంలో ఇసుక సరఫరాలో ఇబ్బందులు రాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలకు ఇసుకను ఉచితంగా ఇస్తున్నాం. ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని వదులుకుంటున్నాం. రీచుల వద్ద, స్టాక్ యార్డుల వద్ద రవాణ పేరుతో కానీ... ఇతర పేర్లతో ఎక్కువ ఛార్జీలు వసూలు చేయడానికి వీల్లేదు. దీనిపై పటిష్ట నిఘా పెట్టాలి' అని ముఖ్యమంత్రి ఆదేశించారు.




**కాలేజ్ కరిక్యులంను రీ-స్ట్రక్చర్ చేయాలి :** "కాలేజీ విద్యను మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలి. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కాలేజీ విద్యను రీ-ఓరియేంటేషన్ చేయాల్సి ఉంది. ఈ మేరకు అధ్యయనం చేయండి. యూనివర్శిటీలతో నిత్యం అనుసంధానం చేసుకోవాలి. ట్రెడిషన్ కోర్సులతో పాటు... డిమాండ్ ఉన్న కోర్సులను, కొత్త కరిక్యులంను ప్రవేశపెట్టేలా కసరత్తు చేయాలి. ఈ మేరకు కరికుల్యంను రీ-స్ట్రక్చర్ చేసేలా చూడాలి. అలాగే యూనివర్శిటీల ర్యాంకింగులు కూడా మరింతగా పెరగాల్సి ఉంది. విశాఖలోని ఆంధ్రా యూనివర్శిటీతోపాటు... మిగిలిన యూనివర్శిటీలు కూడా ర్యాంకింగులను మరింతగా పెంచుకోవాల్సి ఉంది. ఇదే సందర్భంగా హయ్యర్ ఎడ్యుకేషనల్ కౌన్సిల్ కూడా మరింత యాక్టివ్‌గా ఉండాలి. ఈ మేరకు విద్యా శాఖ అధికారులు కృషి చేయాలి. మధ్యాహ్న భోజన పథకం విషయంలో ఎలాంటి ఫిర్యాదులు కానీ... విమర్శలు కానీ రాకూడదు. శాప్ విభాగం తన యాక్టివిటీని మరింత పెంచుకోవాలి. 5కే రన్ వంటి కార్యక్రమాలు చేపట్టాలి. ప్రజల్లో, యువతలో ఆరోగ్య రక్షణ పట్ల అవగాహన కల్పించేలా శాప్ చర్యలు చేపట్టేలా శాప్ చర్యలు తీసుకోవాలి. రోడ్డు ప్రమాదాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. ప్రజల్లో అవగాహన కల్పించాలి. ట్రిపుల్ రైడింగ్ వల్ల ఎక్కువ ప్రమాదాలు.. మరణాలు జరుగుతున్నాయి. ఇలాంటి వాటిని నివారించాలి. కఠినంగా నిబంధనలు అమలు చేయడానికంటే ముందు... ప్రజలను ఎడ్యుకేట్ చేయాలి. హెల్మెట్ వల్ల ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. ట్రాఫిక్ నిబంధనలు తమ కోసమేననేది ప్రజలు అర్థం చేసుకునేలా అవగాహన కల్పించాలి. విద్యుత్, కేబుల్ తీగలు కిందకు వేలాడుతున్న కారణంగా అగ్ని ప్రమాదాలు జరిగి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటివి ఇకపై జరగడానికి వీల్లేదు' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**పిడుగుపాటుపై మరింత అప్రమత్తత అవసరం :** 'పిడుగు పాటుకు ప్రజల ప్రాణాలు పోకూడదనే ముందస్తుగా అలెర్ట్ మెసేజ్‌లు పంపిస్తున్నాం... అయినా అక్కడక్కడా మరణాలు సంభవిస్తున్నాయి. టెక్నాలజీని వినియోగిస్తున్నాం... కానీ ప్రజల్లో దానిపై అవగాహన కలిగించేలా చేయకుంటే ఏం ఉపయోగం...? ఫోన్లల్లో మెసేజీలు పెట్టడమే కాదు... క్షేత్ర స్థాయిలో ఉన్న సిబ్బందినీ అలెర్ట్ చేయాలి. అలాగే ఫలానా టవర్ లోకేషన్ పరిధిలో పిడుగులు పడే ప్రమాదం ఉందని నెట్ వర్క్ ద్వారా ప్రజలకు తెలియచేసేలా చూడాలి' అని సీఎం ఆదేశించారు. సమీక్ష అనంతరం ఆర్టీజీఎస్ రూపొందించిన అవేర్2.0 మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సామాన్యుడికీ 'ప్యాలెస్' ప్రవేశం!



(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. విశాఖపట్నంలోని రుషికొండ భవనాల (ప్యాలెస్) సద్వినియోగంపై కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ మంగళవారం వెలగపూడి సచివాలయంలో 5వ సారి సమావేశమైంది. పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో మంత్రులు పయ్యావుల కేశవ్, డోలా బాల వీరాంజనేయస్వామి వర్చువల్ గా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రుషికొండ భవనాలను కేవలం ప్రభుత్వ ఆస్తిగా ఉంచకుండా ప్రజల సందర్శనకు అనుమతించి తద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరే మార్గాలను అన్వేషిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. సీఆర్ జెడ్ నిబంధనల ప్రకారం హిల్ టాప్ పైన 2400 చదరపు మీటర్లు, కొండ కింద మరో 2400 చదరపు మీటర్లు.. వెరసి 4800 చదరపు మీటర్ల భూమి అందుబాటులో ఉందని కమిటీ ప్రాథమికంగా గుర్తించిందన్నారు. దీని ఆధారంగా భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ప్రజలకు ఉపయోగపడేలా, ప్రాపర్ యుటిలైజేషన్ చేసే దిశగా కమిటీ ఆలోచిస్తుందన్నారు. ఈ భవనాల నిర్వహణకు తాజ్, ఎట్మాస్ఫియర్ కోర్, లీలా, ఫెమా వంటి ప్రఖ్యాత అంతర్జాతీయ హోటల్ గ్రూపులు ఆసక్తిని కనబరిచాయన్నారు.. ఇతర ఆసక్తిగల సంస్థలను కూడా ఆహ్వానించే అంశంపై కమిటీ చర్చించిందన్నారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల నిర్మించిన ఈ ప్యాలెస్ నిర్వహణ, విద్యుత్ ఛార్జీల కోసమే నెలకు సుమారు రూ. 25 లక్షల ప్రజా ధనం ఖర్చవుతోందని, ఇది ఖజానాపై మోయలేని భారమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఇప్పటివరకు జరిగిన 5 భేటీల సారాంశంతో కూడిన తుది నివేదికను త్వరలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అందజేస్తామని మంత్రి దుర్గేష్ తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఈ అంశాన్ని రాష్ట్ర కేబినెట్ ముందు ఉంచి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు కమిటీ తరపున మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.

## 104 సంచార వైద్య వాహనాల్లో మందుల సరఫరా మరింత పటిష్టం



- **ఇ-ఔషధిలో తప్పనిసరిగా నమోదు చేసేలా చర్యలు**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని 104 సంచార వైద్య వాహనాలకు మందులు, సర్జికల్స్ సరఫరా వ్యవస్థను మరింత పటిష్టపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ వాహనాల్లో గ్రామాలకు వెళ్లి రోగులకు మందులు పంపిణీ చేస్తారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ నుంచి మందులు, సర్జికల్స్ సరఫరాకు సంబంధించిన స్టాకు వివరాల్ని ఇ-ఔషధ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్న వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ ఆదేశాల మేరకు ఈ విధానంపై రెండు రోజుల పాటు రాష్ట్ర స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఐటీ విభాగం నిర్వహించింది. రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు 104 సంచార వైద్య వాహనాల డేటా ఎంట్రీ ఆపరేటర్లకు జిల్లాల్లో శిక్షణ ఇస్తారని సి-డాక్ సీనియర్ ప్రాజెక్ట్ ఇంజనీర్ పసుపులేటి అశ్విని నేడొక ప్రకటనలో తెలిపారు. 104 సంచార వైద్య వాహనాల విభాగంలో పనిచేసే జిల్లా, రీజినల్ మేనేజర్లు, ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్‌లు 55 మందికి రాష్ట్రస్థాయిలో శిక్షణ ఇచ్చామని ఆమె తెలిపారు. ఆన్‌లైన్‌లో స్టాకు వివరాలు అందుబాటులో ఉండడం వల్ల మందులు, సర్జికల్స్ ఎప్పటికప్పుడు చెక్ చేసుకునేందుకు వీలుంటుందని, అవసరాల మేరకు సరఫరా చేసేందుకు వీలు కలుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఏడాది క్రితం నుంచే హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో ఆన్‌లైన్ స్టాకు నమోదును అమలు జరుగుతోందని, కార్యదర్శి సౌరభ్ గౌర్ ఆదేశాల మేరకు 104 వాహనాల్లో కూడా ఈ విధానాన్ని అమలు చేసేందుకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించామని ఆమె తెలిపారు. మంగళగిరి ఎపిఐఐసి టవర్స్ లో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి శిక్షణా కార్యక్రమం జరిగింది.

# జల సంరక్షణే లక్ష్యం



(మొదటి పేజీ తరువాయి)

అనంతరం పవన్ కళ్యాణ్ ప్రసంగిస్తూ "నీరు ఎక్కడుంటే అక్కడ అభివృద్ధి బాగుంటుంది. ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడతాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవన విధానం మెరుగవడానికి గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార వంటి నదులే జీవనాధారం. వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా దేశంలో ముందు వరుసలో ఉండటానికి మనకు సమృద్ధిగా ఉన్న నీటి వనరులే కారణం. అలాంటి నీటిని సంరక్షించుకునే పెద్ద సవాల్ ఇప్పుడు మన ముందుంది. ఉపరితల జలాలను జాగ్రత్తగా కాపాడుకోవడం, రానురాను తగ్గుతున్న భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దీనిపై ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలి. భవిష్యత్తును సుందరంగా నిర్మించుకోవాలంటే ప్రతి నీటి చుక్క ఎంత విలువైందో తెలుసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో లభ్యమయ్యే నీటి సంరక్షణ చర్యలు, వృథా అయ్యే నీటిని కాపాడుకునే చర్యలను వేగవంతం చేయడం ద్వారా భవిష్యత్తు తరాలకు మనం భరోసానిచ్చినట్లు అవుతుంది.

**గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థకు ఎన్నో అవరోధాలు:** ప్రతి కుటుంబానికీ తగినంత తాగు నీరు అందించాలనే ఆశయానికి క్షేత్రస్థాయిలో ఎన్నో అవరోధాలు ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తగినంతగా - ఉపరితలంలో లభించే నీరు లభ్యత లేకపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడం కీలకమైన సమస్యలుగా ఉన్నాయి. లభ్యతగా ఉన్న నీరు కూడా ఎక్కువగా కాలుష్యం బారిన పడుతోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరి శిఖర గ్రామాల్లో వేసవిలో నీటి సమస్యను తీర్చేందుకు వాటర్ షెడ్ల పునరుద్ధరణకు ప్రణాళికలు వేస్తున్నాం. మారుతున్న సాంకేతికను ఎప్పటికప్పుడు వినియోగించుకొని నీటి కొరత తీర్చేందుకు, నీటి సంరక్షణ చర్యలు చేపట్టేందుకు యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నాం. ముఖ్యంగా నీటి సంరక్షణ చర్యల్లో ప్రజల భాగస్వామ్యం అవసరం.

**నీటి సంరక్షణకు ప్రాధాన్యం :** ప్రతి కుటుంబానికి తగినంత తాగునీరు అందించాలనే బృహత్ సంకల్పంతో జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని మొదలుపెట్టిన గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశయానికి అనుగుణంగా ముందుకు వెళ్తాం. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్గదర్శకంలో నీటి పొదుపు చర్యలు తీసుకుంటాం. జల్ జీవన్ మిషన్ 2.0 కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తాం. నీటిని జాగ్రత్తగా వినియోగించుకునేలా, వృథా నీటిని పునర్వినియోగించుకునేలా ప్రజల్లో అవగాహన తీసుకురావడం ప్రధానం.

**100 రోజుల ప్రణాళికకు శ్రీకారం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "100 రోజుల నీటి వినియోగ డ్రైవ్" అనే కార్యక్రమాన్ని ఈ ఏప్రిల్ 6వ తేదీ నుంచి జూలై 14వ తేదీ వరకు చేపట్టింది. దీనిలో ప్రజల్లో చైతన్యం కలిగించి భూగర్భ జలాల పెంపుదల, నీటి వృథాను అడ్డుకోవడం, నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవడం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం వంటి చర్యలను తీసుకుంది. ప్రకృతిలో మన జీవనం.. జీవితం ముడిపడి ఉందనేది భారతీయ సంస్కృతికి మూలం. ప్రకృతిని కాపాడుకుంటే, ప్రకృతి మనకు మంచి చేస్తుంది. జీవితాన్ని, ప్రకృతిని సమతుల్యం చేసుకుంటేనే భవిష్యత్తు అనేది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. ప్రకృతి ఇచ్చిన నీటి వనరులను ఉపయోగించుకోవడంలో జాగ్రత్త వహించాలి" అన్నారు.

ఈ వర్క్‌షాపులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కాలుష్య నియంత్రణమండలి ఛైర్మన్ డా.పి కృష్ణయ్య, ఏపీ ఎస్ఐఆర్డీ కమిషనర్ ముత్యాల రాజు, అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతికి చట్టబద్ధతపై హర్షం వ్యక్తం చేసిన పోలాకి శ్రీనివాసరావు



విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) : అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా చట్టబద్ధంగా గుర్తిస్తూ గెజిట్ విడుదల కావడం రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే కీలక పరిణామమని ఆంధ్రప్రదేశ్ బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదానికి, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి, అలాగే బిల్లుకు మద్దతు తెలిపిన పార్లమెంట్ సభ్యులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అమరావతి అభివృద్ధికి కూటమి ప్రభుత్వంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన కృషి విశేషమని పేర్కొన్నారు.

అమరావతి సాధన కోసం పోరాడిన అమరవీరులను స్మరించుకుంటూ, ముఖ్యంగా మహిళల త్యాగం, దీక్షను ఆయన ప్రశంసించారు. ఈ ఉద్యమానికి తోడ్పడిన ప్రజలు, మీడియా ప్రతినిధుల పాత్రను గుర్తించారు. ఇకపై రాష్ట్ర ప్రజలందరూ గర్వంగా "మా రాజధాని అమరావతి" అని చెప్పుకునే సమయం వచ్చిందని పేర్కొంటూ, భవిష్యత్తులో అందరి సహకారంతో అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

## గుంటూరులో నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక




గుంటూరు, ( జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం గుంటూరు తాలూకా యూనిట్ నూతన కమిటీ ఎన్నికలు మంగళవారం నగరంలోని ఎన్‌జీవో హోంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఎన్నికల అధికారిగా సిహెచ్ కళ్యాణ్ కుమార్, సహ ఎన్నికల అధికారిగా జీవి కోటేశ్వరరావు, పరిశీలకునిగా బి. కృష్ణ కిషోర్ వ్యవహరించారు. సింగిల్ సెట్ నామినేషన్లు మాత్రమే దాఖలు కావడంతో కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

నూతనంగా ఎన్నికైన కమిటీలో అధ్యక్షుడిగా పి. సాంబయ్య (జిల్లా కోర్టు), ఉపాధ్యక్షులుగా మల్లికా బేగం (రోడ్లు భవనాల శాఖ), టి. వీర కిషోర్ (జిల్లా కోర్టు), కార్యదర్శిగా ఎం. శ్రీనివాసరావు (వాణిజ్య పన్నుల శాఖ) ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా పి. సాంబశివరావు (పాలిటెక్నిక్ కాలేజ్), జే. రామకృష్ణ (రెవిన్యూ శాఖ), కోశాధికారిగా సయ్యద్ రుక్సానా (జల వనరుల శాఖ) బాధ్యతలు చేపట్టారు.

ఎన్నికల అనంతరం జరిగిన సమావేశానికి జిల్లా జేఏసీ చైర్మన్ మరియు ఏపీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఏ. శ్యాం సుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ చంద్రశేఖర్, కార్యదర్శి జి సుబ్బనారాయణ తదితరులు హాజరై నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

ఈ సందర్భంగా ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, కొంతకాలంగా నిర్వీర్యంగా మారిన సంఘాన్ని నూతన కమిటీ పునరుద్ధరించి పటిష్టంగా నిర్మించాలని సూచించారు. ప్రతి ఉద్యోగి సంఘ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొని ఐక్యంగా ముందుకు సాగితేనే సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం లభిస్తుందని చెప్పారు. అలాగే సేవా భద్రత, పదోన్నతులు వంటి అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## అమరావతికి ప్రత్యేక పోలీసు వ్యవస్థ



అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్): రాజధాని అమరావతి రాజధానికి ప్రత్యేక పోలీసు వ్యవస్థను ఏర్పాటు చేసేదిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పాలనాపరమైన వ్యవస్థీకృత ఏర్పాట్ల కోసం సమగ్ర నివేదిక తయారు చేసేందుకు ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లను ఆహ్వానించింది. అమరా వతి స్వయం పాలక సంస్థగా మారిన తరువాత దానికి ప్రత్యేక పోలీసు సిబ్బందిని కేటాయించే అంశంపై నివేదికను సిద్ధం చేయాలని, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్లో ఉన్న చట్టాలను పరిశీలించి మెరుగైన పద్ధతులకు సూచనలు చేయాలని టెండర్ నోటిఫికేషన్‌లో ప్రభు త్వం పేర్కొంది. అక్రమాలు, అవినీతి, అనధికారిక నిర్మాణాలపై నిరంతరం పర్యవేక్షణ ఉండేలా ఈ వ్యవస్థ ఉండాలని సూచించింది. మొత్తంగా ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లలో పేర్కొన్న అంశాలను పరిశీలిస్తే రాజధానిని భవిష్యత్‌లో స్వయంపాలిత ప్రాంతంగా మార్చేలా నిబంధనల రూపకల్పనకు ప్రభుత్వం సిద్ధమైందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆర్థిక వనరుల నిర్వహ ణ, యూజర్‌ఛార్జీలు, డెవలప్‌మెంట్ ఛార్జీల వసూలుకు ప్రత్యేక నిబంధనలు రూపొందించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. గతంలో విజయవాడ లాంటి కార్పొరేషన్లలో యూజర్ ఛార్జీల వసూలుకు సిబ్బంది నియమించగా, పెద్దఎత్తున వ్యతిరేకత వచ్చింది. ఇప్పుడు కొత్తగా రాజధానికోసం ఒక వ్యవస్థనే ఏర్పాటు చేయాలని నిర్ణయించడం చర్చనీయాంశమైంది. మొత్తం పరిపాలన కోసం ఒక అపెక్స్‌బాడీ ఏర్పాటుకు వీలుగా ప్రస్తుతంపట్టణాభివృద్ధిశాఖ చట్టాల్లో మార్పులు చేయనున్నారు. అందులోనూ మెట్రోపాలిటన్ ప్లానింగు వర్తిస్తుందా లేదా అనేది కూడా పరిశీలించనున్నారు. అమరావతిని ప్రత్యేక జిల్లాగా ప్రతిపాదిస్తే భూఆదాయ వివరాలను ఎలా ఉండాలనే అంశాన్ని కూడా చేర్చాలని, యంత్రాంగం విధులనూ నిర్దేశించేలా ప్లాను ఉండాలని పేర్కొన్నారు. రాజధాని, ఇతర పరిపాలనా సంస్థల మధ్య సమన్వయం ఎలా ఉండాలనేది, ఆర్థిక వికేంద్రీ కరణ, పిపిపికి అవసరమైన రక్షణ చర్యలను సూచించా లని పేర్కొన్నారు. అమరావతిలో సమగ్ర పరిపాలన సౌలభ్యం కోసం భవిష్యత్‌లో మెట్రోపాలిటన్, నగరం, జోన్, క్లస్టర్ స్థాయిల్లో ప్రత్యేక ప్లాను చేయాలని సూచిం చారు. అపెక్స్ బాడీ నేరుగా నిధులు సమీకరించుకునేం దుకు అధికారాలు కల్పించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లలో పేర్కొన్నారు.

# నీటి సంరక్షణకు 'జలధార' ఉద్యమం



సోమందేపల్లి(జర్నలిస్ట్ ఫైల్) : నీటితోనే సంపద సృష్టించొచ్చాలనేది సీఎం చంద్రబాబు సంకల్పమని, అందుకనే ప్రతి నీటి బొట్టునూ సద్వినియోగం చేసుకోవాలన్న లక్ష్యంతో జలధార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువులు, సాగునీటి కాలువల్లో పూడికతీత, మరమ్మతులు, ఇంకుడు గుంతల నిర్మాణం వంటి పనులను ఈ కార్యక్రమంలో చేపట్టనున్నారు. రాష్ట్రంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదలకు రైతులు, సాగునీటి సంఘాల భాగస్వామ్యంతో కలిసి వంద రోజుల ప్రణాళికలను రూపొందించారన్నారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండలం చాలకూరు గ్రామం సమీపంలోని చెరువులో సోమవారం ఏర్పాటు చేసిన జలధార కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో నీటి సంరక్షణకు పెద్ద ఎత్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నీటి సంరక్షణకు 100 రోజుల పాటు జలధార ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యాచరణ ద్వారా రాష్ట్రంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదలతో ప్రతి ఎకరాకూ సాగునీరందించాలన్నది ప్రధాన ఉద్దేశమన్నారు. వంద రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువులు, సాగునీటి కాలువల్లో పూడికతీతలతో పాటు మరమ్మతులు, ఇంకుడు గుంతలు తవ్వుతామన్నారు. ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టి, భూగర్భ జలాలను పెంచడం, తక్కువ నీటితో ఎక్కువ పంట పండించే విధానాన్ని (డ్రిప్ ఇరిగేషన్)ప్రోత్సహించడం, చెరువుల్లోని మట్టిని పొలాలకు తరలించడం, పంట కుంటల నిర్మించడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. నీటి సంరక్షణను ఉద్యమం చేపట్టామని, రైతులు, సాగునీటి సంఘాల భాగస్వామ్యంతో నీటి సంరక్షణ ఉద్యమం చేపట్టామన్నారు. రాష్ట్రాన్ని కరవు రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వం ప్రధాన ఉద్దేశమన్నారు.

**పేట్రేగిపోతున్న వైసీపీ బ్యాచ్ :** అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్ ఆమోదించడం, ఆ వెంటనే రాష్ట్రపతి గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడంతో జగన్, ఆయన పార్టీ నేతలు సహించలేకపోతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. మావిగన్ అంటూ అమరావతిపై జగన్ మరోసారి విషం కక్కారన్నారు. రాజధానిపై పూటకో మాట, గంటకో మాట ఆడుతుండడంతో ప్రజలు జగన్ పై తీవ్రంగా విరుచుకుపడుతున్నారన్నారు. అమరావతిపై కుట్రలు పన్నడం తప్పు అని చెప్పడంతో, వైసీపీ బ్యాచ్ సహించలేకపోతోందన్నారు. మీడియా సంస్థలపైనా, ప్రజలపైనా దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. ప్రజాభీష్టానికి అనుగుణంగా వ్యవహరించాల్సిందేపోయి, జగన్, ఆయన అనుచరులు చేస్తున్న దౌర్జన్యాలను, దాడులను చూస్తూ ఊరుకునేది లేదని మంత్రి సవిత హెచ్చరించారు.

**వేరుశెనగ రైతులతో ముచ్చట :** జలధార కార్యక్రమం అనంతరం చెరువు పక్కనే ఉన్న వేరు శనగ పంట భూములను మంత్రి సవిత పరిశీలించారు. ఎంతమేర సాగు చేశారు... పంట దిగుబడి గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకొంటున్నారన్నారు. అన్నదాత సుఖీభవ నిధులతో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందజేస్తున్నారన్నారు. రూ.30 వేల కోట్లతో రాయలసీమను హార్టీకల్చర్ హబ్ గా అభివృద్ధి చేస్తున్నారని, రాయసీమలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు వెచ్చిస్తున్నారని మంత్రి సవిత వెల్లడించారు. కూటమి ప్రభుత్వ పాలనపై రైతులు సంతృప్తి వక్తంచేయడంతో మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వెల్లివిరిసిన 'సమ భావన'




విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్): కుల రహిత సమాజం కోసం విజయవాడలో వివిధ రంగాల ప్రజలు కదం తొక్కారు. ఉత్తమ సమాజం కోసం నినదించారు. దీంతో, విజయవాడ నగరంలో 'సమ భావన' వెల్లివిరిసింది. కులం పేరుతో, మతం పేరుతో, దేవుడి పేరుతో దాడులు జరుగుతున్న తరుణంలో సమాజహితం కోరుకునే అనేక సంఘాలు, సంస్థలతో ఏర్పడిన 'సమ భావన' కమిటీ ఆధ్వర్యాన మంగళవారం నుంచి ఈ నెల 14 వరకు విజయవాడలో సాంస్కృతికోత్సవాలకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా తొలి రోజు ఉదయం ఏడు గంటలకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం నుండి ఎంజి రోడ్డులోని అంబేద్కర్ స్మృతి వనం వరకు మారథాన్ వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనేకమంది పుర ప్రముఖులతోపాటు వివిధ సంఘాల ప్రతినిధులు, సభ్యులు, కవులు, కళాకారులు, రచయితలు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో భాగస్వాముల య్యారు. పలు కళాశాలల నుండి వందల సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. డప్పుల చప్పుళ్లతో, జనాలను ఎంతగానో ఉత్తేజపరిచిన తీన్మార్ హోరుతో పొద్దున్నే మహాత్మా గాంధీ రోడ్డు కిక్కిరిసింది. కులాలు పోవాలని, మనుషులంతా ఒక్కటిగా మసలాలని, ఉత్తమ మానవ సంస్కారం సర్వత్రా పరిఢవిల్లాలని కాంక్షించే వారం దరికీ ఎంతో ఉత్తేజాన్నిచ్చింది. ఇంత పెద్ద సంఖ్యలో మరీ ముఖ్యంగా విద్యార్థులు, యువకులు దీక్షగా పాల్గొనడం సమ సమాజాన్ని కోరుకునే వారికి భరోసా ఇచ్చింది. ముందుగా సమ భావన కమిటీ చైర్మన్, ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.సమరం.పూలే, జాషువా విగ్రహాలకు, కమిటీ బాధ్యులు అంబేద్కర్, బాబూజగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్య అతిథి, రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ సోషల్ ఆడిట్ విభాగం డైరెక్టర్ జి.శ్రీకాంత్ కళాక్షేత్రం వద్ద జెండా ఊపి మారథాన్‌ను ప్రారంభించారు. ఈ 'వాక్' అంబేద్కర్ స్మృతి వనం వరకు సాగింది. మహనీయుల చిత్రపటాలు, నినాదాలతో కూడిన ప్లకార్డులతో 'వాక్' ఆద్యంతం ఉత్తేజంగా సాగింది. అప్పటికే రోడ్లపైకి వచ్చిన జనాలు అత్యంత ఉత్సుకతతో తిలకించారు.

కుల మత రహిత సమాజహితాన్ని కాంక్షించే వారే నిజమైన దేశభక్తులని సమ భావన కమిటీ చైర్మన్, ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.సమరం అన్నారు. ప్రముఖ యువ కవి అనిల్ డ్యానీ సమన్వయం చేసిన మారథాన్ వాక్ ప్రారంభ సభలో డాక్టర్ సమరం మాట్లాడారు. కులం మతం అంటూ విడదీసుకుంటూపోతే సమాజం భ్రష్టు పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో అసమానతలు తొలగి కులరహిత సమాజం ఏర్పడాల్సిన ఆవశ్యకత ఉందని వక్కాణించారు. సమాజంలో అందరం సమానత్వాన్ని, సమాన అవకాశాలను, సమాన గౌరవాన్ని కోరుకుంటామని, కుల మత రహిత సమాజం మాత్రమే ఇందుకు దోహదపడుతుందని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగం కూడా ఈ అంశాన్ని ప్రధానంగా నొక్కి చెబుతోందన్నారు. కులరహిత సమాజం ఏర్పాటులో యువతరం ప్రధాన భూమిక పోషించాలని ఆయన పిలుపునిచ్చారు.

# మణిపూర్‌లో ఆగని హింసాకాండ



ఇంఫాల్ : మణిపూర్‌లోని హింసాకాండ విరామం లేకుండా కొనసాగుతోంది. తాజాగా జరిగిన హింసకాండలో ఇద్దరు చిన్నారులతో సహా నలుగురు మృతి చెందారు. విష్ణుపూర్ జిల్లాలో మంగళవారం జరిగిన బాంబు దాడిలో ఇద్దరు పిల్లలు మృతి చెందారు. వారి తల్లి తీవ్రంగా గాయపడ్డారు. తెల్లవారు జామున ఒంటిగంట సమయంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. మోయిరంగ్ ట్రాంగ్లోబి ప్రాంతంలో ఒక ఇంటిపై మిలిటెంట్లుగా అనుమానిస్తున్న వ్యక్తులు బాంబు విసరడంతో ఐదేళ్ళ బాలుడు, ఆరుమాసాల చిన్నారి మరణించారు. ఘటన జరిగిన సమయంలో వారు వారి ఇంట్లోని పడకగదిలో నిద్రిస్తున్నారని పోలీసు అధికారి తెలిపారు. ఈ సంఘటనతో స్థానికులు పెద్ద ఎత్తున నిరసనలకు దిగారని పోలీసులు తెలిపారు. ఇది జరిగిన వెంటనే విష్ణుపూర్ జిల్లాలోని భద్రతా బలగాల శిబిరాన్ని స్థానికులు చుట్టుముట్టారు. ఆ శిబిరాన్ని ధ్వంసం చేశారు. దాంతో వారు జరిపిన కాల్పుల్లో ఐదుగురు గాయపడ్డారని, వీరిలో ఇద్దరు మృతి చెందారని అధికారులు తెలిపారు. అలాగే ఆ ప్రాంతంలోని రెండు చమురు ట్యాంర్లను, ట్రక్కును తగలబెట్టారు. మోయిరంగ్ పోలీసుస్టేషన్ ఎదుట టైర్లను తగలబెట్టిన స్థానికులు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పోలీసు ఔట్‌పోస్టును ధ్వంసంచేశారు. దాంతో ఆ ప్రాంతంలో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు భద్రతా బలగాలను మోహరించారు. ఇద్దరు మైనర్ల హత్యకు గురైన నేపథ్యంలో ఆ ఏరియాలో వాహనాలరాకపోకలను అడ్డుకున్నారు. ఈ బాంబు దాడిలో అమాయకులైన పిల్లలు మరణించడాన్ని దారుణమైన చర్యగా ముఖ్యమంత్రి వై.ఖేమ్‌చంద్ వ్యాఖ్యానించారు. ఇందుకు కారకులైన వారిని కచ్చితంగా గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు.

## ఆరుగురు క్రికెట్ బుకీలు అరెస్టు



పల్నాడు జిల్లా : ఆరుగురు క్రికెట్ బుకీలను పల్నాడు జిల్లా నరసరావుపేట పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను డిఎస్‌పి హనుమంతరావు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.... నరసరావుపేట పట్టణంలోని ఐలా బజార్ ప్రాంతంలో క్రికెట్ బెట్టింగ్ జరుగుతుందన్న పక్కా సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. బుకీలు షేక్ ఖాసీం, షేక్ మస్తాన్ వలీ, షేక్ రఫీ జాన్, నాగరాజు, చక్రవర్తి, వెంకటేశ్వరరావులను అదుపులోకి తీసుకున్నారు. వారు క్రికెట్ మ్యాచ్‌లపై బెట్టింగ్‌లు నిర్వహిస్తూ యువత నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి రూ 4.58 లక్షల నగదు, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని డిఎస్‌పి తెలిపారు.

# వ్యక్తిగత దూషణలు సరికాదు



న్యూఢిల్లీ : ఎల్‌డిఎఫ్ ప్రభుత్వంపై తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విమర్శలను పినరయి విజయన్ తిప్పికొట్టారు. ఈమేరకు మంగళవారం బహిరంగ లేఖ రాశారు. రాజకీయ విభేదాలు సహజమే అయినప్పటికీ, వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదని రేవంత్‌కు విజయన్ గట్టిగా బదులిచ్చారు. అలాగే, కేరళ సాధించిన ప్రగతిని, తమ ప్రభుత్వ జవాబుదారీతనాన్ని విజయన్ గణాంకాలతో సహా వివరించారు. దీంతో ఇది జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది.

**వ్యక్తిగత దూషణలకు విజయన్ అభ్యంతరం:** రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పినరయి విజయన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "రాజకీయ విభేదాలు సహజమే, కానీ వ్యక్తిగత దూషణలకు దిగడం నేను తిరస్కరించే వైఖరి" అని విజయన్ స్పష్టం చేశారు. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ప్రజలకు నిరంతరం జవాబుదారీగా ఉంటుందని, ఐదేళ్లకోసారి మాత్రమే కాదని ఆయన అన్నారు. తమ ప్రభుత్వ ప్రగతి నివేదికలు బహిరంగంగా అందుబాటులో ఉన్నాయని, రేవంత్ వ్యాఖ్యలకు వాస్తవ ఆధారాలు లేవని విజయన్ విమర్శించారు.

**కాంగ్రెస్ చరిత్రపై విజయన్ విమర్శలు :** కేరళ సామాజిక సూచికలకు కాంగ్రెస్ పార్టీ ఘనతను ఆపాదించే రేవంత్ ప్రయత్నంపై విజయన్ చారిత్రక వాస్తవాలను ప్రస్తావిస్తూ విమర్శలు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన మొదటి దశాబ్దంలోనే భూస్వామ్య వ్యవస్థను అంతం చేసే లక్ష్యంతో మొదటి కమ్యూనిస్ట్ మంత్రివర్గం వ్యవసాయ సంబంధాల బిల్లును ప్రవేశపెట్టిందని, అయితే అప్పటి కాంగ్రెస్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 356ను దుర్వినియోగం చేసి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని అప్రజాస్వామికంగా రద్దు చేసిందని విజయన్ గుర్తు చేశారు. వికేంద్రీకృత పాలనా వ్యవస్థను 1993లో 73వ, 74వ రాజ్యాంగ సవరణలకు దశాబ్దాల ముందే తమ మొదటి మంత్రివర్గం రూపొందించిందని విజయన్ తెలిపారు. 1980లలో అక్షరాస్యతా ఉద్యమానికి ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం నాయకత్వం వహించిందని, 1996లో తమ పీపుల్స్ ప్లానింగ్ క్యాంపెయిన్ ప్రజాస్వామ్య వికేంద్రీకరణలో విప్లవాత్మక మార్పులు తెచ్చిందని, రాష్ట్ర ఐదేళ్ల ప్రణాళికలో మూడింట ఒక వంతు నిధులను స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేసిందని ఆయన వివరించారు.

తాము పటిష్టమైన విజ్ఞాన ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తున్నామని, 2026 ఐటి పాలసీ ద్వారా దేశ ఐటి ఎగుమతులలో 10 శాతం వాటాను సాధించే దిశగా ఉన్నామని విజయన్ తెలిపారు. భారతదేశపు మొదటి డిజిటల్ సైన్స్ పార్క్, వేగంగా అభివృద్ధి చెందుతున్న 20 వేల డీప్-టెక్ స్టార్టప్‌ల నెట్‌వర్క్ ఈ డిజిటల్ విజన్‌కు మద్దతు ఇస్తున్నాయని ఆయన తెలిపారు. నిజమైన మౌలిక సదుపాయాలు రాజకీయ సంకల్పంపై ఆధారపడి ఉంటాయని, కేవలం వాదనలపై కాదని విజయన్ స్పష్టం చేశారు. జాతీయ రహదారుల విస్తరణ, గెయిల్ పైప్‌లైన్, ఎడమోన్-కొచ్చి పవర్ హైవే వంటి కీలక ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపుగా వదిలివేసిందని, కొచ్చి మెట్రో, విజింజం అంతర్జాతీయ సీపోర్ట్ ప్రాజెక్టులకు కూడా కాంగ్రెస్ నేతృత్వంలోని గత కేంద్ర ప్రభుత్వాలు అనవసరమైన జాప్యం చేశాయని, అయితే ఎల్‌డిఎఫ్ వాటిని పునరుద్ధరించి పూర్తి చేసిందని ఆయన అన్నారు.

సామాజిక న్యాయం విషయంలో తమ రికార్డు తిరుగు లేనిదని విజయన్ ఉద్ఘాటించారు. 2025 నవంబర్ 1న, కేరళ భారతదేశంలో తీవ్ర పేదరికం లేని మొదటి, ఏకైక రాష్ట్రంగా ప్రకటించిందని ఆయన తెలిపారు. తమ తీవ్ర పేదరిక నిర్మూలన ప్రాజెక్ట్ (ఇపిఇపి) ద్వారా 64,006 కుటుంబాలను గుర్తించి, అవకాషం అతివేగం (రైట్ ఆన్ ఫాస్ట్ ట్రాక్), ఉజ్జీవనం (పునరు జ్జీవం) వంటి మిషన్ల ద్వారా వారికి అనుకూలమైన సూక్ష్మ ప్రణాళికలను అందించామని ఆయన వివరించారు.

జాతీయ పాలనా సూచికలు రేవంత్ ఆరోపణలను ఖండిస్తున్నాయని విజయన్ పేర్కొన్నారు. నీతి ఆయోగ్ కేరళను దేశంలో అత్యంత తక్కువ అవినీతి గల రాష్ట్రంగా, తెలంగాణను 6వ అత్యంత అవినీతి గల రాష్ట్రంగా పేర్కొందని ఆయన గుర్తు చేశారు. జాతీయ సుస్థిర అభివృద్ధి సూచికలో కేరళ 79 పాయింట్లతో 1వ స్థానంలో ఉందని, తెలంగాణ 6వ స్థానంలో ఉందని, వ్యాపారాన్ని సులభతరం చేసే సంస్కరణలను ప్రవేశపెట్టడంలో కేరళ 1వ స్థానంలో ఉందని ఆయన వివరించారు.

నవ కేరళం మిషన్ల ద్వారా తమ ప్రభుత్వం గణనీయ ఫలితాలను అందిస్తోందని విజయన్ తెలిపారు. ఆర్ద్రం మిషన్ 670కి పైగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆధునిక, ప్రజలకు అనుకూలమైన కుటుంబ ఆరోగ్య కేంద్రాలుగా మార్చిందని, 13 వేలకి పైగా ప్రభుత్వ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి, 45 వేల తరగతి గదులను హైటెక్ సౌకర్యాలతో సన్నద్ధం చేసిందని, 19వేలకి పైగా డిజిటల్ లెర్నింగ్ వనరులతో 'సమగ్ర' పోర్టల్‌ను ప్రారంభించిందని విజయన్ తెలిపారు.

బిజెపిని ఎల్‌డిఎఫ్ తగినంతగా విమర్శించడం లేదని రేవంత్ ఆరోపించారని, కానీ రాష్ట్రాల హక్కులను ఉల్లంఘిస్తున్న బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆర్టికల్ 131, 32 కింద సుప్రీంకోర్టులో కేరళ ప్రభుత్వం న్యాయ పోరాటం చేస్తోందని విజయన్ గుర్తు చేశారు. బిజెపియేతర పార్టీల పాలిత రాష్ట్రాలను ఒకే వేదికపైకి తీసుకురావడానికి, 16వ ఆర్థిక సంఘం కోసం ఉమ్మడి కార్యక్రమాలను చేపట్టడానికి తాము చురుకుగా ప్రయత్నిస్తున్నామని ఆయన అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే కేంద్రం చర్యలను ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం రాజీలేని విధంగా విమర్శిస్తోందని విజయన్ స్పష్టం చేశారు.

విజయన్ లేఖలో వ్యక్తిగత విమర్శలకే పరిమితం కాకుండా, పాలనా విధానాలు, చారిత్రక వాస్తవాలు, అభివృద్ధి గణాంకాలు , రాష్ట్రాల హక్కుల పరిరక్షణ వంటి అనేక కీలక అంశాలను ప్రస్తావించారు. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం సాధించిన విజయాలను బలంగా వివరిస్తూ, రేవంత్ రెడ్డి విమర్శలను తిప్పికొట్టారు. "మేము ముందుకు వెళ్తాము, కేవలం ముందుకు మాత్రమే. అందరికీ ఆదర్శంగా నిలిచే నవ కేరళను సృష్టించడం ద్వారా మేము ముందుకు సాగుతాము" అనే విజయన్ లేఖలో వ్యాఖ్యానించారు.

# బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా

## గడ్డం మల్లారెడ్డి ఏకగ్రీవ ఎన్నిక



**రాయికల్** (జర్నలిస్ట్ ఫైల్) :
జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని రామాజీపేట గ్రామంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) గ్రామ శాఖ అధ్యక్షుడిగా గడ్డం మల్లారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలోని పార్టీ కార్యకర్తలు, నాయకుల సమక్షంలో జరిగిన సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నేతలు మాట్లాడుతూ, గడ్డం మల్లారెడ్డి నాయకత్వంలో గ్రామంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలకు సేవ చేయడం, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం తన లక్ష్యమని మల్లారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిరుపేద యువతి వివాహానికి

# రామాజీపేట గ్రామ ప్రజల అండదండలు



**రాయికల్** ఏప్రిల్ 07 (జర్నలిస్ట్ ఫైల్) :
రాయికల్ మండలం రామాజీపేట గ్రామంలో మానవత్వం చాటిన హృదయాన్ని హత్తుకునే సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం పల్లికొండ లతనరేందర్ దంపతుల కుమార్తె వైశాలి వివాహానికి గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించారు.సోమవారం వివాహం జరుగనున్న నేపథ్యంలో గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో సహాయం చేయాలనే సందేశం పెట్టగా, సేవా భావం ఉన్న గ్రామస్తులు తమవంతుగా సహకారం అందించారు. ఈ క్రమంలో మొత్తం రూ.18,516 సేకరించగా, వివాహ వేడుకలో కుటుంబ సభ్యుల సమక్షంలో వధువుకు అందజేశారు. అదనంగా, గ్రామంలోని కొందరు యువకులు ప్రత్యేకంగా ఒక గ్రూప్‌గా ఏర్పడి రూ.5,000 ఆర్థిక సహాయం అందించడం విశేషం.ఈ సందర్భంగా వధువు వైశాలి మరియు ఆమె తల్లిదండ్రులు మాట్లాడుతూ, తమ కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకుని సహాయం చేసిన గ్రామ ప్రజల పెద్దమనసుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని సేవా భావం కలిగిన పలువురు ప్రజలు పాల్గొన్నారు.రామాజీపేట గ్రామ ప్రజల ఈ సహకారం సామాజిక బాధ్యతను, మానవత్వాన్ని ప్రతిబింబించే ఉత్తమ ఉదాహరణగా నిలిచింది.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



(జర్నలిస్ట్ ఫైల్) శేరిలింగంపల్లి:
ప్రజాసేవే లక్ష్యంగా శేరిలింగంపల్లి డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తెలిపారు. సోమవారం నెహ్రూనగర్, గోపీనగర్ తదితర బస్తీల్లో పర్యటించిన ఆయన స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాత ఓపెన్ నాలాల స్థానంలో ఆర్ సీసీ పైప్ లైన్ వేసి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని, పనులకు అడ్డుపడుతున్న బీఆర్ఎస్ నాయకులు వైఖరి మార్చుకోవాలని విమర్శించారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సహకారంతో డివిజన్ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అర్హులైన పేదలకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని పౌరసరఫరాల శాఖాధికారితో ఫోన్లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాజు యాదవ్, రాజేశ్వరమ్మ, యాదా గౌడ్, రవీందర్ గౌడ్, లక్ష్మణ్ యాదవ్, శ్రీకాంత్, నర్సింహా, రమేష్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం ప్రెస్ క్లబ్ పై విచారణ



**– టీడబ్ల్యూజేఎఫ్ నేతలతో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
**– తగు చర్యల నిమిత్తం జిల్లా సహకార అధికారికి ఆదేశాలు**

**ఖమ్మం:** ఏప్రిల్ 07 (జర్నలిస్ట్ ఫైల్) :
ఖమ్మం ప్రెస్ క్లబ్ నిర్వహణ పారదర్శకంగా కొనసాగేందుకు ఆడిటింగ్ తో పాటు ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్ – హెచ్ 2843) విజ్ఞప్తిపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సానుకూలంగా స్పందించారు. ప్రెస్ క్లబ్ నిర్వహణలో చోటు చేసుకుంటున్న అవకతవకలపై విచారణ నిర్వహించాలని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు ఐడీఓసీలో జిల్లా కలెక్టర్ కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. గత పది సంవత్సరాలుగా జరుగుతున్న ఆర్థిక వ్యవహారాలపై జర్నలిస్టుల సమక్షంలో ఆడిటింగ్ చేపట్టాలని, ప్రెస్ క్లబ్ నిర్వహణ పారదర్శకంగా ఉండేందుకు ఎన్నికలు నిర్వహించాలని కోరటంతో తగు చర్యల నిమిత్తం జిల్లా సహకార అధికారికి రిఫర్ చేశారు. దీనికి ముందు ర్యాలీగా కలెక్టరేట్ కు చేరుకున్న పెడరేషన్ నాయకులు, ముఖద్వారం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... గత పది సంవత్సరాలుగా ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో కొన్ని యూనియన్లు ప్రెస్ క్లబ్ కమిటీలను ఏర్పాటు చేసుకొని ప్రెస్ క్లబ్ నిర్వహణ పారదర్శకంగా ఉండకుండా, జవాబుదారీతనం లేకుండా ఇష్టానుసారంగా ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారని తెలిపారు. ప్రెస్ మీట్ ఏర్పాటు చేసిన వారి వివరాలు, ఆదాయం, ఖర్చులు, వాటికి సంబంధించిన రశీదులు, బిల్లులు చూపకుండా మోసపూరిత చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రెస్ క్లబ్ వార్షిక బడ్జెట్ పేరుతో విడుదల చేస్తున్న గణాంకాలలో పారదర్శకత లోపిస్తోందని అన్నారు. తప్పుడు లెక్కలతో ప్రెస్ క్లబ్ ప్రతిష్టను దిగదార్చుతున్నారని చెప్పారు. క్లబ్ కు సంబంధించిన నియమ నిబంధనలు ఏవీ ఖమ్మం ప్రెస్ క్లబ్ విషయంలో అమలు కావడం లేదని అన్నారు. 300 మందికి పైగా జర్నలిస్టులకు చెందిన ఖమ్మం ప్రెస్ క్లబ్ వ్యవహారాలపై చాలా కాలంగా కొందరు అనధికారిక పెత్తనం చేస్తూ... అవకతవకలకు పాల్పడుతున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకునేంత వరకు టీడబ్ల్యూజేఎఫ్ పోరాటం చేస్తూనే ఉంటుందని ప్రకటించారు. ప్రెస్ క్లబ్ నిర్వహణ పారదర్శకంగా కొనసాగేందుకు ఎన్నికల నిర్వహించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, జిల్లా నాయకులు కూరాకుల గోపీ, నలుబోల మధుశ్రీ, షేక్ జానీపాష, దగ్గుబాటి మాధవరావు, గణేష్, ఫయాజ్, అర్షద్, కొరకొప్పుల రాంబాబు, గోపీ, కె. కిరణ్, యాకూబ్ పాష, పాష, యూసుప్, నాగలక్ష్మీ, ఉపేందర్, ప్రసాద్, షకీల్, సతీష్, పవన్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

## - సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..







**గొల్లపల్లి :** (జర్నలిస్ట్ ఫైల్) :
పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందించడమే తమ లక్ష్యమని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని చిల్వాకోడూర్ గ్రామంలోని గ్రామపంచాయతి కార్యాలయ ఆవరణలో సోమవారం మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి లక్ష్మణ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో మండలంలోని గ్రామ గ్రామానికి వచ్చి నేరుగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు .అంతకు ముందు గొల్లపల్లి మండలానికి చెందిన 24 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు,వివిధ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య చికిత్సలు చేయించుకున్న 107 మంది లబ్ధిదారులకు రూ.28 లక్షల 6వేల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అందజేశారు.అలాగే చిల్వాకోడూర్ గ్రామానికి చెందిన కాసా లక్ష్మీరాజం కు రూ.3 లక్షల ఎల్ ఓ సి ని మంత్రి అందించారు. అనంతరం చిల్వకోడూరు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారుల గృహ ప్రవేశ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ బీమా సంతోష్, వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి, తహసిల్దార్ అబ్దుల్ మజీద్ ,ఆర్ ఐ జీవన్ , ఎంపీడీవో రవీందర్ రావు ,సర్పంచ్ ఫోరం అధ్యక్షులు దాసరి తిరుపతి గౌడ్ ,ఆయా గ్రామాల సర్పంచ్ లు , స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు .

# గొల్లపల్లిలో ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



ఏప్రిల్ 07 (జర్నలిస్ట్ ఫైల్) **గొల్లపల్లి** :
జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో బిజెపి పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు .ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షులు చెవుల మధ్య శేఖర్ మాట్లాడుతూ బిజెపి పార్టీ ఆవిర్భవించి 46 సంవత్సరాలు పూర్తి చేసుకుని 47వ వసంతంలోకి అడుగుపెడుతుందని అన్నారు . భారతీయ జనతా పార్టీ వార్త పత్రికల్లో టీవీ చానెళ్లలో యూట్యూబ్ వెలుగుల్లో పుట్టిన పార్టీ కాదు లక్షలాది మంది కార్యకర్తల త్యాగాలపై వేలాదిమంది బలిదానాల స్ఫూర్తిలో పుట్టిన పార్టీ గ్రామాల్లో పల్లెటూళ్లలో పేదవాడి భుజం భుజం కలిపి నడిచిన పార్టీ భారతీయ జనతా పార్టీ అని అన్నారు.డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ, పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం అంత్యోదయ సిద్ధాంతాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఏకైక పార్టీ భాజపా నేనని తెలిపారు .1980 ఏప్రిల్ 6న అటల్ బిహారీ వాజపేయి అధ్యక్షతన ప్రారంభమైన బిజెపి ప్రారంభంలో రెండు స్థానాలతో మొదలై నేడు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చినట్లు తెలిపారు . ఆచరణనుండి నరేంద్రమోడీ నాయకత్వంలో గత మూడు పర్యాయాలుగా అవినీతి రహిత పాలన అందిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద సభ్యత్వం కలిగిన పార్టీగా అవతరించిందని పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ అంటే కేవలం ఒక కుటుంబమో ఒక వ్యక్తో లేదా ఒక వర్గంకోసమో పనిచేస్తున్న పార్టీ కాదు ప్రతి ఒక్క భారతీయుడి ఆకాంక్షల సాకారం కోసం దేశం, ధర్మం మాత్రమే కేంద్రంగా పనిచేస్తున్న కార్యకర్తల కృషి క్రమశిక్షణ అంకితభావమే పార్టీ విజయానికి మూల కారణమని అన్నారు . ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కట్ట మహేష్, మండల ఉపాధ్యక్షులు కట్ట క్రాంతి, మండల ప్రధాన కార్యదర్శి దుస ప్రశాంత్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు బైరం రాజన్న, దళిత మోర్చా మండల అధ్యక్షుడు గుంటుకుల జగదీష్, పట్టణ అధ్యక్షులు సంఘం కళ్యాణ్, సీనియర్ నాయకులు బైరం నారాయణ, కనుకుంట్ల రాంరెడ్డి ,మరికంటి రవి, బుర్రవేణి తిరుపతి, సరసాని అనిల్ రెడ్డి, చెవుల మద్ది కార్తీక్ ,ఒరగంటి రాకేష్, రాజకుమార్, భీమ జలపతి పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అమీన్‌పూర్ రహదారి విస్తరణ పనుల పరిశీలన



(జర్నలిస్ట్ ఫైల్) శేరిలింగంపల్లి:
చందానగర్ డివిజన్ పరిధిలోని జాతీయ రహదారి 65 శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్ వరకు 45కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న రెండు పాయింట్ ఏడు కిలోమీటర్ల మేర నాలుగు వరుసల ప్రధాన రహదారి, రెండు వరుసల సర్వీసు రోడ్డు విస్తరణ పనులను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సోమవారం పరిశీలించారు. సీఎంసి కమిషనర్ సృజన, డీసీ శశిరేఖ, సీసీపీ వెంకన్న, నాయకుడు రఘునాథ్ రెడ్డి, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే బాహ్య వలయ రహదారి ఎగ్జిట్ నంబర్ నాలుగుకు అనుసంధానం సులభతరమవ్వడమే కాకుండా, ఇంధనం, సమయం ఆదా అవుతాయని పేర్కొన్నారు. పనుల్లో ఎక్కడా అలసత్వం ప్రదర్శించకుండా నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, పర్యాటక ప్రాంతంగా ఎదుగుతున్న అమీన్‌పూర్ సరస్సు పరిసరాల్లో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ శ్రీలక్ష్మి, ఈఈ నామ్యా, ఏసీపీ రాణి, టీపీఎస్ రమేష్ తదితరులు

# ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు



(జర్నలిస్ట్ ఫైల్) **శేరిలింగంపల్లి:**
గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డి, నానక్‌రామ్‌గూడలో బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1980లో కేవలం ఇద్దరు ఎంపీలతో ప్రారంభమైన బీజేపీ, నేడు నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ శక్తిగా ఎదిగిందని కొనియాడారు. కార్యకర్తల త్యాగాలతోనే పార్టీ బలోపేతమైందని, సుపరిపాలనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కిషన్ గౌలి, శివ సింగ్, హనుమంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**సీసీ రోడ్డు పనుల పరిశీలన:–**

నానక్‌రామ్‌గూడలో రూ. 49 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి స్థానికులతో కలిసి పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, అధికారుల పర్యవేక్షణ నిరంతరం ఉండాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా లెవెల్స్ సరిచూసుకుంటూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గచ్చిబౌలి డివిజన్‌ను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శివ సింగ్, మీన లాల్ సింగ్, బబ్లీ సింగ్ పాల్గొన్నారు.

**కూలిన పాఠశాల గోడ పునర్నిర్మాణానికి చర్యలు:–**

కేశవనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ, కిచెన్ గది కూలిన ఘటనపై మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



తక్షణమే స్పందించారు. ప్రమాద స్థలాన్ని సందర్శించిన ఆయన, పక్కనే జరుగుతున్న భవన నిర్మాణ సెల్లార్ తవ్వకాల మట్టి ఒత్తిడి వల్లే గోడ కూలిందని గుర్తించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి, ప్రహరీని నాణ్యతతో పునర్నిర్మించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సునీత, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ ప్రవేశాలకు

# దేవి రెడ్డి పల్లి ఆదర్శ పాఠశాలలో ఆహ్వానం

**నల్లచెరువు,** ఏప్రిల్ 07 (జర్నలిస్ట్ ఫైల్) :
మండల పరిధిలోని దేవిరెడ్డిపల్లి ఆదర్శ పాఠశాలలో 202627 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రవేశాలు ప్రారంభమైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బాబా ఫక్రుద్దీన్ తెలిపారు.ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఏప్రిల్ 1వ తేదీ నుంచి పాఠశాలలో ప్రవేశాలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.పాఠశాలలో నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, సమగ్ర సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉత్తమమైన బోధన అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్‌లో చేరదలచిన విద్యార్థులు అవసరమైన అర్హత పత్రాలతో పాఠశాలను సంప్రదించాలని,ప్రవేశాలపై పూర్తి వివరాలకు కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ సూచించారు.

## తాడేపల్లిలో ఏసీబీ తనిఖీలు



- దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కాళిశీగిరి శాంతి అరెస్ట్
- అక్రమ ఆస్తుల కేసులో విజయవాడ తరలింపు

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్ ):** తాడేపల్లి పశువుల ఆసుపత్రి సమీపంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కాళిశీగిరి శాంతి నివాసంలో మంగళవారం విజయవాడ అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏసీబీ డిఎస్పి స్రవంతి ఆధ్వర్యంలో 25 మంది అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. తాడేపల్లి లోని మరో ప్రాంతంలోని ఆమె అపార్ట్మెంట్ ప్లాట్ లో కూడా ఏసీబీ సోదాలు నిర్వహించారు. అనంతరం శాంతిని అరెస్ట్ చేసి విజయవాడకు తరలించారు. విజయవాడ ఏసీబీ డిఎస్పి స్రవంతి మీడియా తో మాట్లాడుతూ దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కళిశీగిరి శాంతి అవినీతి ఆస్తులను గుర్తించి ఏసీబీ కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. విచారణలో భాగంగా సెర్చ్ వారెంట్ తీసుకొని శాంతి నివాసాలలోను మరియు ఆమె కుటుంబీకుల నివాసాలలో అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో ఏకకాలంలో సోదాలు నిర్వహించడం జరిగిందన్నారు. పూర్తి వివరాలు విచారణ అనంతరం తెలియజేస్తామని తెలిపారు.

## ముగ్గురు టిడిపి కార్యకర్తలకు ప్రమాద బీమా అందజేత



**మంగళగిరి( జర్నలిస్ట్ ఫైల్):** తాడేపల్లి పట్టణంలో తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తల కుటుంబాలకు పార్టీ తన నిబద్ధతను మరొకసారి చాటింది. ప్రమాదంలో చనిపోయిన టిడిపి కార్యకర్తలు మూరతోట సుబ్బారావు, సంగం శ్రీనివాసరావు, బూదాల దాసు ల కుటుంబాలకు సభ్యత్వ బీమా పథకం కింద రూ. 5 లక్షల చొప్పున ప్రమాద భీమా చెక్కులను మంగళవారం తాడేపల్లి పట్టణ టీడీపీ పార్టీ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ పార్టీకి విశ్వాసంగా సేవలందించిన కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. కష్టకాలంలో కార్యకర్తల పట్ల అండగా నిలబడటం తెలుగుదేశం పార్టీ ప్రత్యేకత అని వారు పేర్కొన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చొరవ తో వచ్చిన ఈ సహాయంతో బాధిత కుటుంబానికి ఆర్థికంగా కొంత ఊరటనిచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మూరతోట మాణిక్యాలు, సంగం విజయలక్ష్మి,అరుణ లు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకి, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కి, హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ ఎప్పుడూ కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, వారి కుటుంబాలకు అండగా ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి దార దాసు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా గ్రంథాలయ సంస్థల్లో జీతాలు, పెన్షన్లు నిలిచిపోవడంతో ఆందోళన

**గుంటూరు, ( జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని జిల్లా గ్రంథాలయ సంస్థల్లో తీవ్ర ఆర్థిక సంక్షోభం నెలకొని జీతాలు, పెన్షన్లు నెలల తరబడి చెల్లించకపోవడం ఆందోళన కలిగిస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. కల్లేపల్లి మధుసూదన రాజు, కన్వీనర్ కోన దేవదాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ప్రస్తుత పరిస్థితి అత్యంత దారుణంగా మారిందని పేర్కొన్నారు.

గ్రంథాలయ సంస్థలకు సరైన గ్రాంట్లు విడుదల కాకపోవడంతో ఉద్యోగుల జీతాలు, పెన్షనర్లు తీసుకోవాల్సిన పెన్షన్లు, పత్రిక బిల్లులు, స్వీపర్ చార్జీలు, పుస్తక పంపిణీ కేంద్రాల సిబ్బంది వేతనాలు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, గ్రామీణ గ్రంథాలయ ఉద్యోగుల జీతాలు, కరెంట్ బిల్లులు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. చివరికి చైర్మన్‌లకు కూడా జీతాలు ఇవ్వలేని స్థితి నెలకొనడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోందన్నారు.

ప్రభుత్వం రూ. 150 కోట్ల గ్రాంట్ అవసరమున్న చోట కేవలం రూ. 29 కోట్లు మాత్రమే కేటాయించడం వల్ల ఈ సంక్షోభం మరింత పెరిగిందని విమర్శించారు. గ్రంథాలయ సంస్థ అభివృద్ధికి ప్రభుత్వానికి వారధిగా ఉండాల్సిన చైర్మన్‌లు ఈ సమస్యపై దృష్టి సారించకపోవడం బాధాకరమని అన్నారు. తమ పలుకుబడి ఉపయోగించి పూర్తి స్థాయి నిధులు తీసుకురావడంలో చైర్మన్‌లు చురుకుదనం చూపాలని కోరారు. అలాగే సంబంధిత మంత్రులను కలిసి పరిస్థితి వివరించి, ముఖ్యంగా పెన్షనర్లకు ప్రాధాన్యతనిస్తూ తక్షణమే నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరాలని సూచించారు. ప్రస్తుతం గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో మహిళా చైర్మన్‌లు జీతాలు, పెన్షన్లు విడుదల చేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, ఇతర జిల్లాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాలు సమస్యలపై మాట్లాడితే స్పందించాల్సిన బదులు కొందరు చైర్మన్‌లు ఎదురు దాడులకు దిగుతున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్‌లు, కార్యదర్శులు, డైరెక్టర్ కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు, పెన్షనర్ల సంఘాలతో కలిసి తక్షణమే సమావేశం ఏర్పాటు చేసి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

## నాలుగు గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారిగా తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)** మండల ప్రజాపరిషత్ ప్రజా ప్రతినిధుల పదవీకాలం పూర్తయిన క్రమంలో ప్రత్యేక అదికారుల పాలన మొద లైంది. ఈ నేనపథ్యంలో మండల తహశీల్దార్ కెవి. గోపాల కృష్ణ, మండలంలోని నందివెలుగు, కటేవరం, నేలపాడు, పెదరావూరు గ్రామాలకు ప్రత్యేక అధికారిగా నియమితులైనారు. మంగళవారం ఆయా ప్రచాయతీ కార్యాలయాలకు వెళ్ళిన మండల తహశీల్దార్ కెవి. గోపాల కృష్ణ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. గ్రామ కార్యదర్శులకు గ్రామపరిపాలన పరంగా స్పష్టమైన ఆదేశాలిచ్చారు. పెదరావూరు గ్రామ పంచాయితీ కార్యాలయంలో, బాద్యతలు చేపట్టిన మండల తహశీల్దార్ గోపాల కృష్ణ మీడియాతో మాట్లాడుతు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారిగా బాద్యతలు చేపట్టామని, గ్రామంలో ప్రజల అవసరాలు, మౌలిక సదుపాయాలకు తగు ప్రాధాన్యం కల్పిస్తామని, జఠిల సమస్యలు ఉంటే,మంత్రి వర్యుల దృష్టికితీసుకువెళతామన్నారు. అనంతరం పంచాయతి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

# ఆహారం ఎలా ఉంది ? బాగుంటుందా ?

- సమయానికి వడ్డిస్తున్నారా ?
- మెనూ పాటిస్తున్నారా ?
- జీజీహెచ్‌లో డైట్‌ను తనిఖీ చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- రోగులకు ప్లేట్లు సమకూర్చాలని ఆదేశం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :**ప్రజల ఆరోగ్య భద్రతమే ప్రభుత్వ లక్ష్యమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిని ఎమ్మెల్యే నసీర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ?వ్పత్రిలో రోగులకు అందిస్తోన్న డైట్ ను పరిశీలించారు. రోగులకు ఎలాంటి ఆహారం అందిస్తున్నారు? ఏయే మెనూ సిద్ధం చేస్తున్నారు ? సమయపాలన పాటిస్తున్నారా ? ఆహారంలో నాణ్యత ఉంటుందా ? వంటి అంశాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆహారం అందించాలని సూచించారు. రోగులతోపాటు సహాయకులకూ భోజనం వడ్డించాలని చెప్పారు. ఎక్కువ మంది రోగుల సహాయకులు చేతిలో బాక్స్ లు ఉండటం చూసిన ఎమ్మెల్యే నసీర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ యశశ్వీ రమణతో మాట్లాడారు. ఆహారం వడ్డించే సమయంలో ప్లేట్లు కూడా సమకూర్చాలని సూచించారు. అనంతరం కొందరు రోగులను ఎమ్మెల్యే నసీర్ స్వయంగా పలకరించారు. జీజీహెచ్ కు వచ్చి ఎంత కాలమైంది ? ఏ సమస్యలతో వచ్చారు ? ఎలాంటి వైద్య సదుపాయాలు అందుతున్నాయి ? వంటి అంశాలపై ఆరా తీశారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రి రాష్ట్రానికి సంజీవనిలాంటిదని, సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు చేరువ చేస్తున్నామని తెలిపారు. జీజీహెచ్ కు దాతలు, ప్రభుత్వ సాయంతో మాతాశిశు సంక్షేమ భవన నిర్మాణం పూర్తి చేశామని, దీని ద్వారా 600 పడకలతో వైద్య సేవలు అందించబోతున్నామని వెల్లడించారు.

## ఇండస్ట్రియల్ పార్కు కోసం అంజుమనే ఇస్లామియా భూములు ఇవ్వలేం

- ముస్లీం సంస్థల ప్రతినిధులు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** ఇండస్ట్రియల్ పార్క్ కోసమని కూటమి ప్రభుత్వం, చినకాకాని వద్దగల అంజుమనే ఇస్లామియా సంస్థ భూములను, సేకరించేందుకు నోటీసులు ఇవ్వడంపై, స్వయంగా అబ్యంతరాలు తెలియజేసేందుకు వివిధ ముస్లీమ్ సంస్థల ప్రతినిధులు మంఖళవారంసబ్ కలెక్టర్ లక్ష్మికుమారికి తమ అభ్యంతరాలు వివరించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఇచ్చిన నోటీసుల మేరకు,స్వయంగా అభిప్రాయం వెలిబుచ్చేందుకు వచ్చిన వివిధ ముస్లీమ్ సంఘాల ప్రతినిధులు సబ్ కలెక్టర్ లక్ష్మీకుమారి దృష్టికి తెచ్చిన అభ్యుతరాలలో, గుంటూరు అంజుమనె ఇస్లామియా ధార్మిక సంస్థకు, మంగళగిరి మండలం, చినకాకానిలో గల, 71.57 ఎకరాల వ్యవసాయ భూమి, అంజుమనే ఇస్లామియా సంస్థకు ఉన్న ఒకటే ఆస్తిఅని, అదిప్రభుత్వ భూమి కాదని,వక్ఫ్ బోర్డు ఆస్తికూడా కాదన్నారు. 1998రెవిన్యు రికార్డలలో కూడా, ఆభూముల యజమానిగా, అంజుమనే ఇస్లామియా నమోదైనట్లు తెలిపారు. వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజక వర్గ సమన్వయకర్త,పార్టీ గుంటూరు నగర అద్యక్షురాలు నూరి ఫాతిమ మాట్లాడుతు చంద్రబాబు ప్రభుత్వం ఇండష్టియల్ పార్క్ కోసమని, ముస్లీమ్ ధార్మిక సంస్థ భూములు తీసుకునే, భూసేకణ ప్రకటనను వెనక్కి తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మొండిగా ఆభూమిని తీసుకోవాలని చూస్తె, ముస్లీమ్ లంతా సంఘటితంగా రోడ్డెక్కుతామన్నారు. భూసేకరణ కోసం ఇస్మామియా ధార్మిక సంస్థల ఆస్తుల జోలికి రావద్దని, తమ అబ్యంతరాన్ని బలంగా వినిపించారు. అనంతరం లిఖిత పూర్వకంగా తమ అభ్యంతరాన్ని సబ్ కలెక్టర్ లక్ష్మి కుమారికి అందజేశారు. అనంతరం ముస్లీమ్ సంస్థల ప్రతినిధులు మీడియా ముఖంగా తమ విధానాన్ని వివరించారు. ముస్లీమ్ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అద్యక్షులు మహ్మద్ కలీం మాట్లాడుతు చినకాకానిలో అంజుమనె ఇస్లామియాకు గల భూమి, 1915, దాతలు ఇచ్చినది గుర్తుచేశారు. 1962ప్రభుత్వ గెజిట్ లొ, ఆతదుపరి సర్వేకమీషన్ రిపోర్టులొ, రెవిన్యు రికార్డులలోఇస్లామియా సంస్థకు ఉన్న ఆస్తిగా ఉందన్నారు. కుటమి ప్రభుత్వం విడుదల చేసిన నోటీస్ విభిన్నంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో ముస్లిం సంస్థల ప్రతినిధులు, అంజుమనే ఇస్లామియా ప్రతినిదులు ఉన్నారు.

## పేదల జీవితాల్లో మార్పు లక్ష్యంగా పనిచేయాలి : ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రభుత్వ ఉద్యోగులు కేవలం జీతం కోసమే కాకుండా, పేదల జీవితాల్లో మార్పు తెచ్చే లక్ష్యంతో పనిచేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సూచించారు. వినుకొండ పురపాలక సంఘ సమావేశ మందిరంలో నియోజకవర్గంలోని గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు, రైతులకు ఏది అవసరమో గుర్తించి ఆ పనులకే నిధులు ఖర్చు చేసే బాధ్యతను అధికారులు తీసుకోవాలని, అంకితభావంతో పనిచేసినప్పుడే నిజమైన సంతృప్తి లభిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జలధార' కార్యక్రమాన్ని నియోజకవర్గవ్యాప్తంగా విజయవంతం చేయడానికి అధికారులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉపాధి హామీ నిధులు, మ్యాచింగ్ గ్రాంట్లను సద్వినియోగం చేసుకుంటూ చెక్ డ్యామ్‌లు, వాటర్ షెడ్స్, ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు హయాంలో 'నీరు-చెట్టు' కార్యక్రమం ద్వారా బొల్లాపల్లి వంటి మెట్ట ప్రాంతాల్లో కూడా భూగర్భ జలాలు పెరిగాయని, తద్వారా అక్కడి రైతులు వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపుతున్నారని గుర్తుచేశారు.

రైతుల ఆదాయం రెండు మూడు రెట్లు పెరిగేలా హార్టికల్చర్ పంటలపై ప్రత్యేక దృష్టి సారించాలని, లాభసాటి వ్యవసాయం దిశగా రైతాంగాన్ని చైతన్యపరచడంలో అధికారులు కీలక పాత్ర పోషించాలని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో వినుకొండ నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, డ్వామా పిడి ఎ సిద్ధ లింగమూర్తి,నూజండ్ల స్పెషల్ ఆఫీసర్ బాలాజీ రెడ్డి, నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఎం వర్సిటీలో ఏఆర్ వీఆర్ ఇన్నోవేషన్ వర్క్ షాప్



**అమరావతి,( జర్నలిస్ట్ ఫైల్):** దేశంలో అభివృద్ధి చెందుతున్న నూతన సాంకేతిక పరిజ్ఞానాల పట్ల యువతలో సరైన అవగాహన, నైపుణ్యాభివృద్ధిని పెంపొందించే లక్ష్యంతో ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ మంగళవారం ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), వర్చువల్ రియాలిటీ (వీఆర్) వర్క్‌షాప్ ను నిర్వహించింది. యంగ్ ఇన్నోవేటర్స్ స్టెమ్ ల్యాబ్ తో కలిసి ఎస్ఆర్ఎం వర్సిటీ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, ఇండో-యూఎస్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫోరం మరియు హర్యానాలోని స్టెమ్ యూనివర్సిటీ లు వర్క్ షాప్ నిర్వహణకు సహకారం అందించాయి. ఈ వర్క్ షాప్ లో ఏఆర్, వీఆర్ అంశాలను ప్రాజెక్టు ఆధారిత పద్ధతిలో విద్యార్థులకు పరిచయం చేశారు. అమరావతి పరిసర పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి సుమారు 200 మందికి పైగా విద్యార్థులు ఈ వర్క్‌షాప్ నకు హాజరయ్యారు. హర్యానాలోని స్టెమ్ యూనివర్సిటీ సహ వ్యవస్థాపకులు ధరంరాజ్ పవార్ వర్సిటీ మేకర్ స్పేస్ ఆఫీసర్ పరాస్ దేశ ముఖ్, ఆర్ అండ్ డీ హెడ్ మహ్మద్ ముస్తఫా, ఫెసిలిటేటర్లు దేవానంద్. శశాంక్ చదేలీలు వర్క్ షాప్ నకు హాజరై విద్యార్థులకు ఏఆర్ వీ ఆర్ యాప్ రూపకల్పన, వెబ్ ఎక్స్ ఆర్ టెక్నాలజీ, డిజైన్ థింకింగ్ విధానాలను వివరించారు. ఎస్ఆర్ఎం యూనివర్శిటీ ఉప కులపతి ఆచార్య సతీష్ కుమార్ మాట్లాడుతూ ఈ తరహా వర్క్ షాప్ లు విద్యార్థులకు ఆధునిక సాంకేతికతలపై అవగాహన కల్పించడమే కాకుండా డిజిటల్ వరంగా వారు రాణించేందుకు నైపుణ్యాలను మెరుగుపరుస్తాయన్నారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ సతీష్ కుమార్ స్టెమ్ వర్సిటీ సహ వ్యవస్థాపకులు ధరంరాజ్ పవార్ను సత్కరించి జ్ఞాపికను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్ కల్లూర్ అసోసియేట్ డీన్ ఆచార్య జయశీలన్ మరుగయ్యన్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అశోక్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

## సీఏఎస్ నియామకాలు పూర్తిగా పారదర్శకం - వైద్య ఆరోగ్య శాఖ స్పష్టం

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా ఇటీవల నిర్వహించిన 611 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (సీఏఎస్)నియామకాలలో లోపాలు ఉన్నాయంటూ ఒక దినపత్రికలో ప్రచురితమైన వార్త అసత్యమని రాష్ట్రవైద్య ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. వైద్య ఆరోగ్య శాఖ శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు బోర్డు అధికారులతో కలిసి వివరాలను సమీక్షించగా, ఎటువంటి అవకతవకలు జరగలేదని నిర్ధారణకు వచ్చినట్లు తెలిపింది.

ప్రచురితమైన అంశాలను రికార్డులతో సహా సవివరంగా పరిశీలించగా, మార్కుల లెక్కింపులో తలెత్తిన కొన్ని చిన్నపాటి సాంకేతిక పొరపాట్లను అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు వెంటనే సరిదిద్దినట్లు తెలిపారు. ఉదాహరణకు, కొవిడ్ సేవల అనుభవాన్ని తప్పుగా నమోదు చేసిన ఒక అభ్యర్థి విషయంలో సరిచేసి తగిన మార్కులు కేటాయించడంతో అతని స్థానం మెరిట్ జాబితాలో మార్పు చెందినట్లు పేర్కొన్నారు.

రోస్టర్ అమలులో ఎటువంటి తప్పిదాలు జరగలేదని శాఖ స్పష్టం చేసింది. ఎస్సీ కేటగిరికి సంబంధించిన అభ్యర్థి ఎంపికలో వచ్చిన అనుమానాలను పరిశీలించగా, సరైన కేటగిరి ప్రకారం ఎంపిక జరిగిందని తేలింది. మెరిట్ జాబితాలో ఉన్న అభ్యర్థులకు ఇచ్చిన మార్కులు సర్వీస్, సీనియారిటీ తదితర ప్రమాణాల ఆధారంగానే లెక్కించబడినట్లు రికార్డులు నిర్ధారించాయి.

నాన్-లోకల్ అభ్యర్థుల ఎంపికపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ, 40 శాతం ఓపెన్ కేటగిరిలో స్థానికతకు ప్రాధాన్యం ఉండదని, నిబంధనల ప్రకారమే ఎంపికలు జరిగాయని వెల్లడించారు. అలాగే ఆలస్యంగా మార్కుల జాబితా సమర్పించిన అభ్యర్థుల వివరాలను కూడా గత విధానాల ప్రకారం పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు.

కొన్ని రోస్టర్ పాయింట్లు భర్తీ చేయలేదన్న ఆరోపణపై స్పందిస్తూ, స్పోర్ట్స్ కేటగిరికి సంబంధించిన నియామకాలు అనుమతులు పెండింగ్‌లో ఉండటంతో తాత్కాలికంగా వాయిదా వేసినట్లు వివరించారు. ఈ స్థానాలను త్వరలో భర్తీ చేస్తామని తెలిపారు.

రిజర్వేషన్ అమలులో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించినట్లు స్పష్టంచేశారు. మొత్తం ఎంపికల్లో గణనీయమైన సంఖ్యలో రిజర్వ్ వర్గాలకు అవకాశాలు లభించాయని రికార్డులు సూచిస్తున్నాయని పేర్కొన్నారు.

సీఏఎస్ పోస్టులు రాష్ట్ర స్థాయి పోస్టులు కావడంతో జోనల్ నియమాలు పోస్టింగుల్లో వర్తించవని, కాబట్టి ఒక జోన్‌కు చెందిన వైద్యులను ఇతర ప్రాంతాలకు నియమించడం నిబంధనల ప్రకారమేనని తెలిపారు. అదనపు మార్కులు ఎవరికి కేటాయించలేదని, ఇతర అభ్యర్థులకు ఎటువంటి నష్టం కలగలేదని స్పష్టం చేశారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య రంగంలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ, ఎలాంటి జోక్యం లేకుండా పెద్ద ఎత్తున నియామకాలు చేపడుతున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ పేర్కొంది. నిరాధార ఆరోపణలు ప్రజల్లో అపోహలు కలిగించడమే పారదర్శకంగా, నిబ్ధతతో పనిచేస్తున్న ప్రభుత్వ ప్రతిష్ఠను, విశ్వసనీయతను దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆందోళనను వ్యక్తం చేసింది. ప్రజలకు సరైన సమాచారం అందేలా వాస్తవాలను స్పష్టంగా ప్రచురించాలని మీడియాను శాఖ కోరింది.

## అమరావతిలో ఎన్ఎఫ్‌డీబీ ప్రాంతీయ కార్యాలయం - ప్రధానికి కృతజ్ఞతలు



- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్

**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లోని మత్స్యకారుల దీర్ఘకాల డిమాండ్‌కు స్పందిస్తూ అమరావతిలో నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్ఎఫ్‌డీబీ) ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని నరేంద్ర మోదీకి రాష్ట్ర ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో మాధవ్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాది మంది మత్స్యకారులు ఎంతోకాలంగా చేస్తున్న డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం గుర్తించడం హర్షణీయమన్నారు. ఎన్ఎఫ్‌డీబీ ప్రాంతీయ కార్యాలయం స్థాపనతో రాష్ట్ర మత్స్యరంగానికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.

ఆక్వా కల్చర్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు భారీగా విదేశీ మారక ద్రవ్యం వస్తోందని, ఈ నేపథ్యంలో రాష్ట్రానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి ఈ కార్యాలయాన్ని మంజూరు చేయడం ప్రధాని దూరదృష్టికి నిదర్శనమని తెలిపారు.

ఈ కార్యాలయం ద్వారా మత్స్యకారులకు సాంకేతిక సహాయం, మార్కెటింగ్ అవకాశాలు, ఆధునిక విధానాల అమలు సులభమవుతాయని, తద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మరింత తోడ్పాటు అందుతుందని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థి చనిపోవడం దురదృష్టకరం



- విధులపట్ల నిర్లక్షంగా వ్యవహరించిన విద్యుత్ అధికారిని సస్పెండ్ చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలి
- ఆశ్రమంలో భద్రత, పర్యవేక్షణ చర్యలు చేపట్టాలి
- మృతుడి కుటుంబానికి 50,లక్షల ఆర్థిక సాయం అందజేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ డిమాండ్

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారి మఠం మండలం తోట్లపల్లి గ్రామం వద్ద ఉన్న శ్రీ అచలానంద ఆశ్రమం వద్ద 33 లెవెన్ కేవీ విధ్యుత్ వైర్ కారణంగా మరణించిన కార్తీక్ మృతదేహాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. శివకుమార్ మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ మండల కమిటీ సభ్యులు సానా గోవిందస్వామి రెబ్బ నరసింహులు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎద్దు రాహుల్ బృందం సందర్శించి మృతదేహానికి నివాళి అర్పించి కార్తీక్ తల్లిదండ్రులకు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి వారికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి శివకుమార్ మాట్లాడుతూ

ప్రకాశం జిల్లా దర్శి మండలం బోట్లపాలెం గ్రామానికి చెందిన కార్తీక్ అనే విద్యార్థి అచలానంద ఆశ్రమంలో ఉంటూ బ్రహ్మంగారిమఠంలో ఉన్నఒక ప్రైవేట్ హై స్కూల్ నందు 8వ తరగతి చదువుకుంటున్నాడని సోమవారం రాత్రి స్నానానికి వెళ్లిన కార్తీక్ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా క్రిందకు వేలాడుతున్న 33 లెవెన్ కె.వి వైర్లను తగులుకొని మరణించడం దురదృష్టకరమని భవిష్యత్తులో ఉన్నత చదువులు చదువుకొని తన కుటుంబానికి అండగా నిలవాల్సిన విద్యార్థి అధికారుల నిర్లక్ష్యానికి బలి కావడం బాధాకరమని వారి ఆందోళన వ్యక్తం చేశారు. పేదరికం కారణంగా అచలానంద ఆశ్రమంలో ఉంటూ అక్కడ సేవ చేస్తూ రాష్ట్రశీ లోని వివిధ ప్రాంతాలకు చెందిన 23 మంది విద్యార్థులు బ్రహ్మంగారిమఠంలో చదువుకుంటున్నారని వారి ఆలనా పాలన ఆశ్రమ నిర్వాహకులు చూస్తున్నారని వారు గుర్తు చేశారు. ఆశ్రమం దగ్గర ఏర్పాటు చేసిన కులాయి దగ్గర స్నానం చేసి వస్తానని వెళ్లిన కార్తీక్ కేవలం అధికారుల నిర్లక్ష్యం బాధ్యతారాహిత్యం కారణంగానే మరణించారని వారు ఆరోపించారు. నీటి కులాయికి 15-20 అడుగుల దూరంలోనే 33/11 కేవీ వైర్లు కేవలం ఏడు అడుగుల ఎత్తులో కిందికి వేలాడుతున్నాయని ఆశ్రమ నిర్వాహకులు అనేకమార్లు సంబదిత విద్యుత్ ఏఈ గారి దృష్టికి తెచ్చిన సమస్యను పరిష్కరించకపోగా నిర్లక్ష్యంగా దాటవేశాడని ఆశ్రమంలో పనిచేస్తున్న పలువురు సిబ్బంది తెలిపారని వారన్నారు. అక్కడ వేలాడుతున్న విద్యుత్ వైర్లు ఏ రకంగా ఎవరికీ ఉపయోగంలో లేవని అటువంటి వైర్లను తొలగించకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి విద్యార్థి మరణానికి కారణమైన సంబంధిత అధికారిని సస్పెండ్ చేసి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆశ్రమం నిర్వాహకులు సరైన పర్యవేక్షణ నిర్వహించడం లేదని భద్రత చర్యలు కూడా లేవని అక్కడ పనిచేయని సిసి కెమెరాలు చూస్తే అర్థమవుతుందని వారన్నారు. 23 మంది వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులే కాక నిరంతరం వందల మంది పండుగ సందర్భాలలో వేలమంది భక్తులు, యాత్రికులు ఇక్కడికి వస్తుంటారని ఇటువంటి ఆశ్రమంలో నిరంతరం పర్యవేక్షణ అవసరమని ఆ లోపం స్పష్టంగా కనిపిస్తుందని వాటి పట్ల ఆశ్రమ నిర్వాహకులు దృష్టి పెట్టాలని వారికి సూచించారు. మృతుడి కుటుంబానికి విద్యుత్ డిపార్ట్మెంట్, ఆశ్రమ నిర్వాహకులు ప్రభుత్వం నుండి 50లక్షల రూపాయల ఆర్థిక సాయం అందజేయాలని వారు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు తలెత్తకుండా నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



○ ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి మంగళవారం ప్రకటన విడుదలైంది.

ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా బలమైన అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలకు మేలు చేస్తున్నాయని తెలిపారు. అమరావతి రాజధానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం ద్వారా శాశ్వత గుర్తింపు లభించిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ పరిణామం రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి దోహదం చేస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబడతాయని పీవీఎన్ మాధవ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఎస్కేయూ వైస్ ఛాన్సలర్‌ను కలిసిన నల్లపల్లి విజయభాస్కర్



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్):** శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జ్యోతి కుమార్ ను ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయభాస్కర్ మంగళవారం అనంతపురం లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అభివృద్ధి, ఉద్యోగుల సమస్యలపై మాట్లాడడం జరిగిందని నల్లపల్లి విజయభాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎ పి ఎస్ ఇ ఎ జిల్లా నాయకులు జోషి, యూనివర్సిటీ ఇంజనీరింగ్ మరియు ఫార్మసిటుకల్ ఉద్యోగులు పాల్గొన్నారు

# కాంట్రాక్టు ఉద్యోగులపై హైకోర్టు తీర్పును అమలు చేయాలి

**గుంటూరు, ( జర్నలిస్ట్ ఫైల్):** కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సేవల అంశంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాష తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో దశాబ్దాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరియు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలను దృష్టిలో ఉంచుకొని హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పు ఎంతో కీలకమని పేర్కొన్నారు. దీని ద్వారా ఉద్యోగుల హక్కులు రక్షించబడతాయని, వారికి న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కాంట్రాక్టు మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం బేషరతుగా క్రమబద్ధీకరించాలని ఆయన డిమాండ్ చేశారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ, దీన్ని తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని చాంద్ బాష అన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుని ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# తిరుపత్తూర్‌లో మార్పు కోరుతున్న ప్రజలు... బీజేపీ గెలుపు ఖాయం



○ తిరుపత్తూర్ విధానసభ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జ్ కొక్కెర శ్రీనివాస్ యాదవ్


**నేషనల్ డెస్క్(జర్నలిస్ట్ ఫైల్):** తిరుపత్తూర్ విధానసభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కెసీ తిరుమారన్‌కు మద్దతుగా బీజేపీతో పాటు అన్నాడీఎంకే, ఏఎమ్ఎంకే, పీఎంకే పార్టీల నాయకులు, కార్యకర్తలు మంగళవారం భారీ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి కార్యకర్తలు హాజరై ఎన్నికల ప్రచార వ్యూహాలపై చర్చించారు.

ఈ సందర్భంగా తిరుపత్తూర్ విధానసభ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జ్ కొక్కెర శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, కూటమి పార్టీల ఐక్యతే విజయానికి బలమని అన్నారు. కెసీ తిరుమారన్‌కు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ స్పష్టంగా కనిపిస్తోందని, ఈ ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు అభివృద్ధి, పారదర్శక పాలన అందించాలన్న లక్ష్యంతో కూటమి పార్టీలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామాల స్థాయిలో కార్యకర్తలు సమన్వయంతో ప్రచారం నిర్వహించి ప్రతి ఓటరును చేరుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో నాయకులు ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉత్సాహంగా కొనసాగించాలని నిర్ణయించారు. కూటమి బలంతో తిరుపత్తూర్ నియోజకవర్గంలో బీజేపీ విజయాన్ని సాధిస్తామని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

# కందుల కొనుగోలు గడువు మే 4 వరకు పొడిగింపు

○ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో కందుల కొనుగోలు గడువు మే 4 వరకు పొడిగించడం జరిగిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఖరీఫ్ 2025-26 సీజన్‌కు సంబంధించి కందులు (రెడ్ గ్రామ్/తూర్) కొనుగోలు గడువును కేంద్ర ప్రభుత్వం పొడిగించడం రైతులకు ఎంతో ఊరటనిచ్చే నిర్ణయం అని అన్నారు. రాష్ట్రంలో ధర మద్దతు పథకం (పీఎస్ఎస్) కింద కొనుగోలు కొనసాగుతుందని మంత్రి తెలిపారు. కొనుగోలు గడువును పొడిగించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ, మే 4 వరకు పొడిగింపునకు ఆమోదం తెలిపిందన్నారు. రైతులు తమ పంటను నష్టపోకుండా విక్రయించుకునేలా చూడటం కూటమి ప్రభుత్వ బాధ్యత. రైతు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర అందేలా ముఖ్యమంత్రి నిరంతరం కృషి చేస్తున్నారు అని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ప్రభుత్వం వెంటనే స్పందిస్తోంది. పంటల కొనుగోలు, గిట్టుబాటు ధర, మార్కెటింగ్ వంటి అన్ని అంశాల్లో రైతులకు న్యాయం జరిగేలా చర్యలు కొనసాగిస్తాము అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం

# మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌తో పాలనలో విప్లవాత్మక మార్పులు

○ విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ వర్క్‌షాపు ఎంతో ఉపయోగం

○ ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రాన్ని డిజిటల్ భద్రతలో అగ్రగామిగా నిలపాలనే దూరదృష్టితో, దేశంలోనే అత్యంత ఆధునిక సాంకేతిక ప్రమాణాలతో కూడిన "సైబర్ సెక్యూరిటీ ఆపరేషనల్ సెంటర్' ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ తెలిపారు.. దీని ద్వారా ప్రభుత్వ విభాగాలు, కీలక మౌలిక వసతులు, పౌరుల డేటాకు సమగ్ర రక్షణ కల్పిస్తూ, సైబర్ ముప్పులను ముందుగానే గుర్తించి సమర్థవంతంగా ఎదుర్కొనే విధంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామన్నారు.

మంగళవారం విజయవాడ కానూరు లోని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఏపీటీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాట్సాప్ గవర్నెన్స్ (మన మిత్ర) మరియు సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ వినూత్న ఆలోచనతో, దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ ద్వారా 1,000 కి పైగా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేశామని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ తెలిపారు. మన మిత్ర డిజిటల్ పాలనలో సరికొత్త అధ్యాయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ మేరకు, ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా 95523 00009 నంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పంపడం ద్వారా నిమిషాల్లో సేవలు పొందవచ్చని ఆయన వివరించారు. అందుబాటులో ఉన్న ప్రధాన సేవలు డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, కుల, ఆదాయ ధృవపత్రాలు, భూమి పాస్‌బుక్ వివరాలు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, పెన్షన్ దరఖాస్తులు, ఆరోగ్యశ్రీ, హాల్ టికెట్లు, పరీక్షా ఫలితాలు, తిరుమల సహా ప్రముఖ ఆలయాల దర్శనం, వసతి బుకింగ్స్, ఆర్టీసీ టికెట్లు అందిస్తుందన్నారు. విద్యార్థులు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలను ఆయన సూచించారు. పబ్లిక్ వైఫైలో బ్యాంకింగ్ లావాదేవీలు చేయడం అంత మంచిదికాదని సూచించారు. అనుమానాస్పద లోన్ యాప్స్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలన్నారు. వీడియో లైక్ చేస్తే డబ్బులు వస్తాయనే స్కామ్‌లను నమ్మవద్దన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ సెక్యూరిటీ రంగంలో యువతను ప్రోత్సహించేందుకు ఏపీటీఎస్ ప్రతి ఏటా హ్యాకథాన్‌లు నిర్వహిస్తోందని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10,000 స్టైఫండ్ తో ఇంటర్న్ షిప్ సదుపాయం కల్పిస్తుందని ఆయన వెల్లడించారు. ఏపీటీఎస్ ప్రతినిధులు శ్రీనివాస్, దినేష్ లు సైబర్ మోసాల పై విద్యార్థులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వీఆర్ సిద్ధార్థ కళాశాల వైస్ ఛాన్సలర్ డా. పి. వెంకటేశ్వరరావు, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డా. జె. శివరామ్ ప్రసాద్ లు పాల్గొన్నారు.

# అహికోడ్‌లో బీజేపీ మహా ర్యాలీతో ప్రచారానికి ముగింపు





**నేషనల్ డెస్క్(జర్నలిస్ట్ ఫైల్):** అహికోడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ ప్రచారం చివరి రోజు మంగళవారం మహా ర్యాలీ, రోడ్‌షోతో ఘనంగా ముగిసింది. గత ఆదివారం నుంచి అహికోడ్, చరక్కాల్ మండలాల్లో పోటాపోటీగా నిర్వహించిన ర్యాలీలకు కొనసాగింపుగా చివరి రోజు నిర్వహించిన ఈ కార్యక్రమం కన్నూర్ జిల్లాలోనే విశేష ఆకర్షణగా నిలిచింది.

ఈ సందర్భంగా అహికోడ్ అసెంబ్లీ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జ్ తాడువాయి రామకృష్ణ మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించిన ఈ మహా ర్యాలీ ఓటర్లను విశేషంగా ఆకట్టుకుందని తెలిపారు. కేరళ రాష్ట్రంలో ఎక్కడా నిర్వహించని విధంగా ఈ కార్యక్రమం విజయవంతమైందని పేర్కొన్నారు. సుమారు 500 మంది బీజేపీ కార్యకర్తలు, మహిళా మోర్చా సభ్యులు పాల్గొనడంతో అహికోడ్ నగరం మొత్తం ఉత్సాహభరిత వాతావరణం నెలకొన్నదన్నారు. ఉదయం ప్రారంభమైన ర్యాలీ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగి విజయవంతంగా ముగిసిందని తెలిపారు. ఈ ర్యాలీలో బీజేపీ అహికోడ్ అభ్యర్థి కె.కె. వినోద్ కుమార్, ఇరు మండలాల అధ్యక్షులు, వందలాది కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రచారం చివరి రోజున ప్రజల నుంచి వచ్చిన స్పందన బీజేపీ విజయానికి సంకేతమని తాడువాయి రామకృష్ణ ధీమా వ్యక్తం చేశారు.

# మీడియా స్వేచ్ఛపై దాడులు అంగీకారయోగ్యం కాదు

○ ఎబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడిని ఖండించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్):** ఎబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి దాడులు అసహ్యకరమని, అవి మీడియా స్వేచ్ఛను హరించే చర్యలని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, వార్తా కథనాలపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ప్రజాస్వామ్య పద్ధతుల్లో స్పందించాల్సిందే గానీ, దాడులకు దిగడం సరికాదన్నారు. అభిప్రాయ భేదాలు ఉన్నా చర్చల ద్వారా పరిష్కారం కనుగొనాలని సూచించారు.

రాజధాని అమరావతి విషయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఖరి వివాదాస్పదంగా మారిందని, పదే పదే తన అభిప్రాయాలను మార్చడం వల్ల ప్రజల్లో గందరగోళం నెలకొన్నదని వ్యాఖ్యానించారు. ముందుగా వైసీపీ శ్రేణులే ఈ అంశంపై ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు.

అలాగే సాక్షి మీడియాను ప్రస్తావిస్తూ, తమపై ప్రతికూల కథనాలు ప్రసారం అవుతున్నప్పటికీ, కూటమి పార్టీల నేతల ఖండనలను కూడా ప్రచురించడం లేదని విమర్శించారు. మీడియా సమతుల్యతను పాటించాలని సూచించారు. అమరావతి పట్ల ద్వేషాన్ని విడిచిపెట్టి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని జగన్‌కు మాధవ్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అన్ని రాజకీయ పార్టీలు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

# శ్రీ విద్యా భారతి కాన్వెంట్‌లో ఘనంగా 31వ వార్షికోత్సవం




**గుంటూరు, ( జర్నలిస్ట్ ఫైల్):** నగరంలోని వసంతరాయపురం 3వ లైన్‌లో ఉన్న శ్రీ విద్యా భారతి కాన్వెంట్ పాఠశాలలో 31వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి నేషనల్ స్పైసెస్ బోర్డు డైరెక్టర్ కొత్తూరి వెంకట సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, నేరెళ్ళ మాధవరావు, కారశెట్టి రమేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతూ కొత్తూరి వెంకట సుబ్బారావు విద్యార్థులు కృషి, పట్టుదలతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. వెలగలేటి గంగాధర్ విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, క్రీడలలోనూ ప్రతిభ కనబరచాలని సూచించారు.

వేడుకల్లో భాగంగా విద్యార్థులు నృత్యాలు, గాన కార్యక్రమాలు, ఫ్యాన్సీ డ్రెస్సు ప్రదర్శనలు చేసి ప్రేక్షకులను అలరించారు. వ్యాసరచన, డిబేట్, డ్రాయింగ్, క్రీడా పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కె.సి.వై. రాజేష్ నాయుడు, ప్రిన్సిపల్ కె. అరుణ కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# కొంగాడ్‌లో బీజేపీ అభ్యర్థి రేణు సురేష్‌కు మద్దతుగా అపరాజిత సరంగి ప్రచారం









**కొంగాడ్ (కేరళ):** కేరళ రాష్ట్రంలోని కొంగాడ్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి డా. రేణు సురేష్‌కు మద్దతుగా భువనేశ్వర్ ఎంపీ అపరాజిత సరంగి సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రజలను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లే బీజేపీకి ఓటు వేయాలని ఆమె పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా కొంగాడ్ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జ్ డా. కిలారు దిలీప్ మాట్లాడుతూ, అపరాజిత సరంగి పాల్గొన్న ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. కొంగాడ్ అభివృద్ధి కోసం బీజేపీ అభ్యర్థి డా. రేణు సురేష్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో అభివృద్ధి, పారదర్శక పాలన లక్ష్యంగా ఎన్డీఏ ముందుకు సాగుతోందని, కొంగాడ్ ప్రాంతాన్ని కూడా అభివృద్ధి పథంలోకి తీసుకురావడమే లక్ష్యమని పేర్కొన్నారు. వికసిత కొంగాడ్ లక్ష్యంతో ఎన్డీఏ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అరణ్ములలో భారీ మెజారిటీతో గెలుస్తాం : బీజేపీ ధీమా

○ కుమ్మనం అరణ్ముల నియోజకవర్గంలో ఖాయం

○ నియోజకవర్గం బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి వల్లూరు జయప్రకాశ్ నారాయణ









**నేషనల్ డెస్క్( జర్నలిస్ట్ ఫైల్) :** కేరళం రాష్ట్రంలోని అరణ్ముల నియోజకవర్గంలో మంగళవారం చివరి రోజు ప్రచారం జోరుగా సాగింది. నియోజకవర్గం నలుమూలల నుంచి బీజేపీ, ఎన్డీఏ శ్రేణులు భారీగా తరలి వచ్చి ఉత్సాహంగా పాల్గొన్నాయి. ప్రచార కార్యక్రమాలు ఉత్సవ వాతావరణంలో కొనసాగాయి.

బీజేపీ-ఎన్డీఏ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కుమ్మనం రాజశేఖరన్‌కు ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తోందని అరణ్ముల నియోజకవర్గం బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జ్ వల్లూరు జయప్రకాశ్ నారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో, నియోజకవర్గంలో ప్రజల్లో మార్పు కోసం స్పష్టమైన ఆసక్తి కనిపిస్తోందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోనే "వికసిత కేరళం- వికసిత అరణ్ముల" సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ పాలనలో పరిశ్రమలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని, వలసలను తగ్గించడమే కాకుండా వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

అరణ్ముల నియోజకవర్గంలో బీజేపీ-ఎన్డీఏ అభ్యర్థి కుమ్మనం రాజశేఖరన్ భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని వల్లూరు జయప్రకాశ్ నారాయణ విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారం చివరి రోజున కనిపించిన ప్రజా స్పందనే విజయానికి సంకేతమని ఆయన పేర్కొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467